ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు,
జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -65 పేజీలు - 8 వెల - 03/- బుధవారం 24 జూన్ 2026



# వైకాపా కుల,కుట్ర రాజకీయాలు తిప్పికొట్టాలి



**వైకాపా కుల,కుట్ర రాజకీయాలు తిప్ప కొట్టాలి**

**ప్రతి అంశంపైనా అవగాహన పెంచుకోవాలి**

**మంత్రులకు చంద్రబాబు సూచన**

**అమరావతి,జూన్, 23( రిపబ్లిక్ న్యూస్)** కేబినెట్ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలు కీలక వ్యాఖ్యలు చేశారు. క్రిమినల్స్‌ను వైసీపీ వెనకేసుకొస్తూ రాజకీయం చేస్తోందన్నారు. వైసీపీ నేతలు కుల మీటింగ్‌లు పెడుతూ కులాల మధ్య చిచ్చు పెట్టే కుట్రల్ని దీటుగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కర్నూలులో ఇటీవల చోటుచేసుకున్న ఘటనను ప్రస్తావించిన సీఎం, గ్రామస్థులే బహిష్కరించిన వ్యక్తులకు వైసీపీ మద్దతుగా నిలవడం విచారకరమని వ్యాఖ్యానించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను అనవసర వివాదాల్లోకి లాగేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, అలాంటి సందర్భాల్లో కూటమి ఐక్యతను చాటే విధంగా మంత్రులంతా స్పందించాలని సూచించారు**మిగతా 2లో...**





# ఘనంగా పద్మ పురస్కారాల ప్రదానం

**పద్మభూషణ్ అందుకున్న నటుడు మమ్ముట్టి**

**పద్మశ్రీలు అందుకున్న మురళీమోహన్, రాజేంద్రప్రసాద్**

**కార్యక్రమంలో ప్రధాని మోడీ తదితరుల హాజరు**

**న్యూఢిల్లీ,జూన్, 23( రిపబ్లిక్ న్యూస్)**
రాష్ట్రపతి భవన్‌లో రెండో విడత పద్మ పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన 65 మంది ప్రముఖులకు పద్మ అవార్డులు అందజేశారు. ఈ విడతలో మొత్తం 2 పద్మ విభూషణ్, 7 పద్మభూషణ్, 56 పద్మశ్రీ పురస్కారాలు ప్రదానం చేశారు. సినీ, సాహిత్య, వైద్య, క్రీడా తదితర రంగాల్లో విశేష కృషి చేసిన పలువురు ప్రముఖులు**మిగతా 2లో...**



# పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 ఏళ్లకు పెంపు

**ఎపి కేబినేట్ కీలక నిర్ణయాలకు ఆమోదం**

**80కి పైగా అంశాలకు గ్రీన్ సిగ్నల్**

**వివిధ ప్రాంతాల్లో పెట్టుబడులకు పెద్దపీట**

**పరిశ్రమలు, ఐటీ,పర్యాటకం, రాజధాని అభివృద్ధి, డేటా సెంటర్లకు ప్రాధాన్యం**

**రూ.34వేల కోట్ల పెట్టుబడుల స్థాపన ద్వారా 35వేల ఉద్యోగాల కల్పన**

**ఉండవల్లిలో రూ.426 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన**

**జ్యుడిషియల్ అకాడమీ నిర్మాణానికి రూ.139 కోట్ల వ్యయం**

**అమరావతి,జూన్, 23( రిపబ్లిక్ న్యూస్)**
ఏపీ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన భేటీలో 80కి పైగా అజెండా అంశాలకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వివిధ ప్రాంతాల్లో పెట్టుబడుల స్థాపనకు పెద్దపీట వేస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. పరిశ్రమలు, ఐటీ, పర్యాటకం, రాజధాని అభివృద్ధి, డేటా సెంటర్లు, పునరుత్పాదక ఇంధన రంగానికి సంబంధించిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో తీసుకున్న దాదాపు రూ.34వేల కోట్ల పెట్టుబడుల స్థాపన ద్వారా **మిగతా 2లో...**



# కేంద్రమంత్రి రామ్మోహన్‌తో రాష్ట్ర మంత్రుల భేటీ

**గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంపై తుమ్మల విజ్ఞప్తి**



**న్యూఢిల్లీ,జూన్, 23( రిపబ్లిక్ న్యూస్)**
కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని తెలంగాణ మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి కలిశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం చేపట్టాలని కేంద్రమంత్రికి మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ స్థాపనపై చొరవ తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం తరఫున**మిగతా 2లో...**

## వడ్డెరలకు క్వారీల్లో 33శాతం వాటా

**ప్రభుత్వం జీవో విడుదల..**

**చేతల ప్రభుత్వం అన్న లోకేశ్**


2లో.

# ఆంధ్రా కేజీఎఫ్ 'జొన్నగిరి'..

**నేడు ప్రారంభించనున్న చంద్రబాబు**

- -రూ.405 కోట్లతో జియో మైసూర్ సర్వీసెస్, డెక్కన్ గోల్డ్ మైన్స్ పెట్టుబడి.
- -ఏడాదికి 400 కేజీలు, 900 కేజీలు, 2 టన్నులు-దశల వారీగా పెరగనున్న బంగారం వెలికితీత.
- -ఉత్పత్తి అయిన బంగారం విలువలో రాష్ట్ర ఖజానాకు 4 శాతం రాయల్టీ.
- -గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు.
- -విస్తరణలో భాగంగా రెండో యూనిట్‌కూ శంకుస్థాపన.



**అమరావతి/కర్నూలు , జూన్, 23( రిపబ్లిక్ న్యూస్)**
బంగారు నిక్షేపాల గని అంటే కర్నాటక రాష్ట్రంలోని కేజీఎఫ్ గుర్తొచ్చేది... కానీ ఇప్పుడు ఆ స్థానంలో జొన్నగిరి పేరు మారుమోగనుంది. కరవు కేకలు వినిపించిన ఒకప్పటి కర్నూలు జిల్లా ఇక బంగారం ఉత్పత్తికి ప్రధాన వేదిక కానుంది. దేశంలోనే ప్రైవేట్ రంగంలో అతిపెద్ద గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు కర్నూలు జిల్లా జొన్నగిరిలో ఏర్పాటైంది. జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్‌కు ప్రభుత్వం 1,500 ఎకరాల భూమిని కేటాయించింది. ప్రస్తుతం మొదటి దశలో 600 ఎకరాల్లో తవ్వకాలు జరగనున్నాయి. దీనికి తగినట్టుగా ప్రాసెసింగ్ ప్లాంట్లు ఏర్పాటయ్యాయి. రెండో దశలో మిగిలిన ప్రాంతంలోనూ ప్లాంట్ విస్తరించున్నారు. **మిగతా 2లో...**



# విశాఖ ఫార్మాసిటీలో అగ్నిప్రమాదం

**: విశాఖ పరిశ్రమలపై పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు**

**విశాఖ ఫార్మాసిటీలో అగ్నిప్రమాదం, ఇద్దరు కార్మికుల మృతి**

**పరిశ్రమల్లో తక్షణమే సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని పవన్ ఆదేశం**

**మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా**

**విశాఖపట్నంజూన్, 23( రిపబ్లిక్ న్యూస్)**
విశాఖపట్నం సమీపంలోని అనకాపల్లి జిల్లా, పరవాడ ఫార్మా సిటీలో జరిగిన ఘోర అగ్నిప్రమాదంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందడం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఆయన, విశాఖ పారిశ్రామిక ప్రాంతంలోని అన్ని పరిశ్రమల్లో తక్షణమే భద్రతా తనిఖీలు (సేఫ్టీ ఆడిట్) నిర్వహించాలని**మిగతా 2లో...**

# మెట్రో ఆస్తులపై సీఎం కన్ను

**కాంగ్రెస్ అవినీతి పై పోరాటం చేస్తాం**

**హైదరాబాద్ మెట్రో ట్రైన్ పేరుతో రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి డ్రామాలు : కేటీఆర్**

**మియాపూర్‌జూన్, 23( రిపబ్లిక్ న్యూస్)**
కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతిపై పోరాటం చేస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి పార్టీ నియోజవకర్గ స్థాయి కార్యకర్తల సమావేశం **మిగతా 2లో...**



# గాదె సాయికృష్ణ కేసులో ... కృష్ణలంక సీఐ నాగరాజు అరెస్టు

**విజయవాడలో యువకుడు సాయికృష్ణ అదృశ్యంపై విచారణ**

**సీఐ అరెస్టును అడ్డుకునేందుకు మద్దతుదారుల ప్రయత్నం**

**అమరావతి,జూన్, 23( రిపబ్లిక్ న్యూస్)**
ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన గాదె సాయికృష్ణ (25) అదృశ్యం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు**మిగతా 2లో...**



## వైకాపా కుల,కుట్రరాజకీయాలు తిప్పికొట్టాలి

**మొదటిపేజీ తరువాయి**

ప్రభుత్వ పనితీరును మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలంటే ప్రతి మంత్రి అన్ని శాఖలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలపై కూడా సీఎం కీలక ప్రకటనలు చేశారు. జొన్నగిరి గ్రామాన్ని 'స్వర్ణ గ్రామం'గా నామకరణం చేయాలని ప్రతిపాదించారు. అలాగే జూలై 3న కడప స్టీల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేయనున్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు. కులాల మధ్య చిచ్చుపెట్టే ఆ కుట్రలను దీటుగా తిప్పికొట్టాలని మంత్రులకు ఆయన సూచించారు. మంత్రులు అన్ని శాఖలపైనా అవగాహన పెంచుకోవాలి. తన శాఖ పరిధి కాదని కూర్చోకుండా ప్రతి అంశంపై స్పందించాలి. డీఎస్సీ, వివిధ అంశాలపై వైకాపా చేసే దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి. కృష్ణలంకకు చెందిన గాదె సాయికృష్ణ వ్యవహారంలో ప్రభుత్వ చిత్తశుద్ధిని అతడి కుటుంబసభ్యులు నమ్మారని మంత్రులు అన్నారు. ఈ అంశంలో వైకాపా రాజకీయాలు చేస్తోందని విమర్శించారు.

## వడ్డెరలకు క్వారీల్లో 33శాతం వాటా

### ప్రభుత్వం జీవో విడుదల..ఁచేతల ప్రభుత్వం అన్న లోకేశ్



**అమరావతి,జూన్, 23( రిపబ్లిక్ న్యూస్)**

వడ్డెరలకు క్వారీల్లో 33శాతం వాటా ఇస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. తమది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. 'యువగళం పాదయాత్రలో ప్రజలు పడుతున్న కష్టాలు ప్రత్యక్షంగా చూశా. నాటి పాదయాత్ర సమయంలో తమ కులవృత్తిని కొనసాగించేందుకు క్వారీలు కేటాయించాలని వ్డడెర సోదరులు నన్ను కలిశారు. ఆనాడు నేను ఇచ్చిన హామీ మేరకు క్వారీల్లో 33 శాతం వాటాను వ్డడెరలకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నం. 126 జారీ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయమే ధ్యేయంగా ముందుకు సాగుతోంది' అని అన్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంపైట్ల వ్డడెర సంఘాల నేతలు, కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## గాదె సాయికృష్ణ కేసులో ... కృష్ణలంక సీఐ నాగరాజు అరెస్టు

**మొదటిపేజీ తరువాయి**

బృందం (సిట్), సస్పెన్షన్‌కు గురైన కృష్ణలంక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్ఎస్‌వీవీ నాగరాజును అదుపులోకి తీసుకుంది.గత మే 9న కృష్ణలంక పోలీసులు సాయికృష్ణను అదుపులోకి తీసుకున్నారని, ఆ తర్వాత అతను కనిపించకుండా పోయాడని బాధితుడి తల్లి విజయలక్ష్మి ఆరోపించారు. పోలీసులు తన కుమారుడిని చిత్రహింసలకు గురిచేసి చంపేసి, మృతదేహాన్ని మాయం చేశారని ఆమె ఫిర్యాదు చేశారు. ఈ ఆరోపణలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి, సీఐ నాగరాజును సస్పెండ్ చేయడంతో పాటు సమగ్ర విచారణ కోసం సిట్‌ను ఏర్పాటు చేసింది.ఈ క్రమంలో, సీఐ నాగరాజుపై హత్య, అక్రమ నిర్బంధం వంటి అభియోగాలతో భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్) కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మంగళవారం సిట్ అధికారులు విజయవాడ సింగ్ నగర్‌లోని నాగరాజు నివాసానికి చేరుకున్నారు. ఆ సమయంలో ఆయన మద్దతుదారులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకోవడంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది.
భారీగా మోహరించిన పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చి, నాగరాజును విచారణ నిమిత్తం సిట్ కార్యాలయానికి తరలించారు. అక్కడ సుమారు ఐదు గంటల పాటు సుదీర్ఘంగా విచారించిన అనంతరం ఆయనను అరెస్టు చేశారు. నాగరాజు అరెస్టుకు సంబంధించిన సమాచారాన్ని సిట్ అధికారులు ఆయన కుటుంబ సభ్యులకు అందించారు.

## కేంద్రమంత్రి రామ్మోహన్‌తో రాష్ట్ర మంత్రుల భేటీ

**మొదటిపేజీ తరువాయి**

విజ్ఞప్తి చేశారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన చేసిన వెంటనే స్పందించి.. ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం సివిల్ ఏవియేషన్ తరఫున ఫీజిబులిటీ సర్వే చేసినందుకు రామ్మోహన్ నాయుడికి మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు. అయితే, ఫీజిబులిటీ సర్వేలో ప్రతిపాదిత స్థలం ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం అనువుగా లేనందున మరో స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రతిపాదన చేసినట్టు చెప్పారు.అక్కడ త్వరగా ఫీజిబులిటీ సర్వే చేసి, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంలో చొరవ తీసుకోవాలని కేంద్ర మంత్రికి తుమ్మల విజ్ఞప్తి చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచలం రామాలయం దేశ వ్యాప్తంగానే కాదు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

## విశాఖ ఫార్మాసిటీలో అగ్నిప్రమాదం

**మొదటిపేజీ తరువాయి**

అధికారులను ఆదేశించారు.పరవాడ మండలం, జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీలోని 'దక్షిణ ఎనర్జీ' కెమికల్ ఫ్యాక్టరీలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఫ్యాక్టరీలో ఒక్కసారిగా మంటలు చెలరేగి వేగంగా వ్యాపించడంతో ఇద్దరు కార్మికులు లోపలే చిక్కుకుని సజీవదహనమయ్యారు. మరో ఇద్దరు గాయపడగా, వారిని మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన గురించి తెలియగానే పవన్ కల్యాణ్ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా కఠినమైన భద్రతా చర్యలు చేపట్టాలని అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ దుర్ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

## మెట్రో ఆస్తులపై సీఎం కన్ను

**మొదటిపేజీ తరువాయి**

మియాపూర్‌లోని నేరేడ్ గార్డెన్లో నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. హైదరాబాద్ మెట్రో రైల్ పేరుతో రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి డ్రామాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.30 వేల కోట్ల మెట్రో రైల్ ఆస్తులపై రేవంత్ రెడ్డి కన్ను పడిందన్నారు. బీఆర్ఎస్ తరఫున కార్యకర్తల కష్టంతో గెలిచిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ తన స్వార్థ ప్రయోజనాల కోసం కాంగ్రెస్‌లోకి మారారని ఆరోపించారు. ఆయననే గతంలో పదేండ్ల బీఆర్ఎస్ కాలంలో ఒక్క శేరిలింగంపల్లి నియోజకవర్గానికి రూ.9,500 కోట్లతో ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులతో ఒక ప్రగతి నివేదికను విడుదల చేసిన గాంధీ గుర్తుచేశారు.మరి ఈ రెండేండ్లలో ఎన్ని డబ్బులు నియోజకవర్గానికి తెచ్చారో గాంధీ చెప్పాలని డిమాండ్ చేశారు. అబద్ధపు హామీలతో రేవంత్ రెడ్డి గద్దెనెక్కాడని ఆరోపించారు. తులం బంగారం, మహిళలకు రూ.2500 ఇచ్చినట్టు ఎక్కడా అని ప్రశ్నించారు. కేసీఆర్ మళ్ళీ ఎప్పుడు అధికారంలోకి వస్తారా అని ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో అరచకాలు సృష్టిస్తోందన్నారు. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వ నమోదుతో పాటు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ పైన కార్యకర్తలకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, వివేక్, జగదీష్ రెడ్డి, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, సీనియర్ నాయకులు

# పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 ఏళ్లకు పెంపు

**మొదటిపేజీ తరువాయి**

35వేల ఉద్యోగాల కల్పన సంబంధించిన నిర్ణయాలకు మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఉండవల్లిలో రూ.426 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన, ఏపీ జ్యుడిషియల్ అకాడమీ నిర్మాణానికి రూ.139 కోట్ల వ్యయంతో పనులు చేపట్టడం తదితర నిర్ణయాలకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. అమరావతిలో ఫైవ్‌స్టార్ హోటళ్ల, కన్వెన్షన్ సెంటర్లకు ప్రోత్సాహకాలు ఇచ్చే ప్రతిపాదనలకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విశాఖ, తిరుపతి, కర్నూలు, అన్నవరం ప్రాంతాల్లోనూ పర్యాటక ప్రాజెక్టులకు క్యాబినెట్ అంగీకారం తెలిపింది. ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, సొసైటీల ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచుతూ తీసుకున్న నిర్ణయానికి మంత్రివర్గం అంగీకారం తెలిపింది. అనంతపురం, కడప జిల్లాల్లో సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులకు భూముల కేటాయింపులు, బయోగ్యాస్ ఎ÷లాంట్ల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు ఇచ్చే ప్రతిపాదనలకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. అమరావతి ల్యాండ్ పూలింగ్ స్కీమ్ మొదటి, రెండో దశ కోసం సీఆర్డీఏ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లకు సంబంధించి 95 తాత్కాలిక పోస్టుల మంజూరుకు మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 30 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర కేబినెట్ శుభవార్త చెప్పింది. ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంచుతూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వరంగ సంస్థలు, గురుకుల విద్యాసంస్థలు, సొసైటీ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 ఏళ్ల నుంచి 62 ఏళ్ల పెంపునకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అలాగే, మెమో-57 ప్రకారం 2004 సంవత్సరానికి ముందు నోటిఫికేషన్ ద్వారా నియమితులైన సుమారు 11 వేల మంది ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ నుంచి పాత పెన్షన్ విధానం అమలు చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యకు ప్రభుత్వం పరిష్కారం చూపడంతో ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

# ఆంధ్రా కేజీఎఫ్ 'జొన్నగిరి'..

**మొదటిపేజీ తరువాయి**



ప్రస్తుతం ఏర్పాటైన ఈ ప్లాంట్ ద్వారా తొలి ఏడాదికి 400 కిలోల పసిడిని ఉత్పత్తి చేయనున్నారు. వచ్చే ఏడాది నుంచి 900 కిలోల బంగారం ఉత్పత్తి చేస్తారు. ఈ రకంగా ఏ ఏడాదికి ఆ ఏడాది ఉత్పత్తి పెరుగుతూ... ఏడాదికి 2 టన్నుల వరకు బంగారం ఉత్పత్తి చేయనున్నారు. ఈ మేరకు ప్లాంట్ సామర్థ్యాన్ని ప్రాసెసింగ్ కెపాసిటీని విస్తరించనున్నారు. ఈ ప్లాంట్ ద్వారా 700 మందికి ఉపాధి లభిస్తుంది. ఇక ఉత్పత్తి చేసిన బంగారం ధరలో 4 శాతం రాష్ట్రానికి రాయల్టీగా వస్తుంది. మొదట తీసే 400 కేజీలకు రూ.57 కోట్లు, 900 కేజీలకు రూ.144 కోట్ల వరకూ రాయల్టీ రూపంలో ప్రభుత్వానికి ఆదాయం రానుంది.

**ప్రారంభోత్సవం, శంకుస్థాపన**

కర్నూలు జిల్లా, తుగ్గలి మండలం, జొన్నగిరిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టును ప్రారంభించనున్నారు. అనంతరం ప్లాంట్ విస్తరణలో భాగంగా రెండో యూనిట్‌కూ శంకుస్థాపన చేయనున్నారు. జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, డెక్కన్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ సంస్థలు రూ.405 కోట్ల పెట్టుబడితో బంగారు నిక్షేపాల వెలికితీసే ఈ కర్మాగారాన్ని నెలకొల్పాయి. ఇందుకు అవసరమైన నీటి కోసం హంద్రీనీవా సుజల స్రవంతి ద్వారా 18 కి.మీ. పైపులైన్‌తో 0.021 టీఎంసీలను వినియోగించనున్నారు. ఈ మేరకు రేపు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా బంగారం ఉత్పత్తి పనులు ప్రారంభంకానున్నాయి. దీనికి సంబంధించి ఇప్పటికే గనిలో ట్రయల్ రన్స్ కూడా పూర్తయ్యాయి.

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు**

కర్నూలు జిల్లాలో బుధవారం సీఎం చంద్రబాబు పర్యటించనున్నారు. జొన్నగిరిలో బంగారం శుద్ధి కర్మాగారం ప్రారంభోత్సవం సహా వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ పర్యటన నిమిత్తం ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి నుంచి ఉదయం 10 గంటలకు బయలుదేరి 11.30 గంటలకు జొన్నగిరికి చేరుకుంటారు. 11.45 గంటలకు ప్లాంట్ మొదటి యూనిట్ ను ప్రారంభించి... అనంతరం జీఈఓ మైసూర్ ప్లాంట్ రెండో యూనిట్‌కు శంకుస్థాపన చేయనున్నారు. ఆ తర్వాత మధ్యాహ్నం 12.20 గంటలకు జొన్నగిరిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారు. 3 గంటలకు పత్తికొండ నియోజకవర్గ టీడీపీ నేతలు, కార్యకర్తలతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం అవుతారు.

# ఘనంగా పద్మ పురస్కారాల ప్రదానం

**మొదటిపేజీ తరువాయి**

ఈ గౌరవాలను అందుకున్నారు. మలయాళ సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖ నటుడు మమ్ముట్టికి పద్మభూషణ్ పురస్కారం లభించింది. అలాగే ప్రముఖ వైద్య నిపుణులు నోరి దత్తాత్రేయుడుకు కూడా పద్మభూషణ్ అవార్డు ప్రదానం చేశారు. తెలుగు సినీ రంగానికి చెందిన ప్రముఖ నటులు మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌తో పాటు నటుడు ఆర్. మాధవన్‌కు పద్మశ్రీ పురస్కారాలు దక్కాయి. క్రికెటర్ రోహిత్ శర్మకు కూడా పద్మశ్రీ అవార్డును రాష్ట్రపతి అందజేశారు. ప్రఖ్యాత మలయాళ పాత్రికేయుడు పి.నారాయణన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కేటీ థామస్ పద్మవిభూషణ్ అందుకోగా.. సినీ రంగ ప్రముఖులు మమ్ముట్టి, అల్కా యాగ్నిక్‌తో పాటు ప్రఖ్యాత వైద్యులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు పద్మ భూషణ్ పురస్కారాలను అందుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి నేడు పద్మశ్రీ పురస్కారాలను అందుకున్నవారిలో సినీ నటులు మాగంటి మురళీ మోహన్, రాజేంద్రప్రసాద్ ఉన్నారు. అలాగే, వీరితో పాటు సినీనటుడు మాధవన్, క్రికెటర్ రోహిత్ శర్మ, పలు రంగాలకు చెందిన ప్రముఖులు ఈ పురస్కారాలను అందుకున్నారు. దేశంలోని పలు రంగాల్లో విశేష సేవలందించిన వారికి భారత గణతంత్ర దినోత్సవం వేళ కేంద్రం మొత్తం 131 మందికి పద్మ పురస్కారాలకు ఎంపిక చేసిన విషయం తెలిసిందే. తొలి విడతలో 66 మందికి అందజేయగా.. మిగతా వారికి మంగళవారం ప్రదానం చేశారు. దేశ అభివృద్ధికి, తమ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వ్యక్తులను గౌరవించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది పద్మ పురస్కారాలను ప్రదానం చేస్తోంది. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, గజేంద్రసింగ్ షెకావత్ తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ రైతులకు రక్షణ కల్పించాలి..

**దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పెంచాలి**

**తెలంగాణకు తక్షణమే డీఏపీ, యూరియా సరఫరా చేయాలి**

**పప్పుధాన్యాలు, నూనెగింజల కొనుగోలుపై 25 శాతం పరిమితి ఎత్తివేయాలి**

**మొక్కజొన్న, జొన్నలను కేంద్రం ఎంఎస్‌పిపై కొనుగోలు చేయాలి**

**తెలంగాణ రైతాంగ ప్రయోజనాల కోసం కేంద్రానికి వినతులు**

**కేంద్ర మంత్రులను కలిసిన తుమ్మల, ఉత్తమ్**



**న్యూఢిల్లీ,జూన్, 23( రిపబ్లిక్ న్యూస్)**

: తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నీటిపారుదల మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలోని బృందం మంగళవారం న్యూఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన కీలక ప్రాజెక్టులు, రైతాంగ ప్రయోజనాలకు సంబంధించిన పలు అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించారు. కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలంగాణలో ఆయిల్ పామ్ సాగు విస్తరణ, రైతుల ప్రయోజనాల పరిరక్షణ, దేశీయ వంటనూనెల ఉత్పత్తి పెంపుపై విస్తృతంగా చర్చించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్–ఆయిల్ పామ్ లక్ష్యాలను అత్యంత సమర్థవంతంగా అమలు చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని మంత్రి తుమ్మల వివరించారు. రాష్ట్రంలో ఇప్పటికే సుమారు 3 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు విస్తరించగా, 70 వేల మందికిపైగా రైతులు ఈ పంటను సాగు చేస్తున్నారని తెలిపారు. రాబోయే మూడేళ్లలో ఈ విస్తీర్ణాన్ని 10 లక్షల ఎకరాలకు పెంచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. భారత్ ప్రస్తుతం వంటనూనెల అవసరాల్లో దాదాపు 60 శాతానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతోందని, ఈ పరిస్థితిని మార్చేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన ఆత్మనిర్భర్ కార్యక్రమం దేశ ఆర్థిక వ్యవస్థకు, రైతాంగానికి ఎంతో కీలకమని పేర్కొన్నారు. అయితే ఇటీవల క్రూడ్ పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని 44 శాతం నుంచి 16 శాతానికి తగ్గించడం వల్ల దేశీయ ఆయిల్ పామ్ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దిగుమతి సుంకం తగ్గింపుతో విదేశాల నుంచి చౌక ధరలకు పామాయిల్ దిగుమతులు పెరిగి దేశీయ మార్కెట్లో ధరలు పడిపోతున్నాయని, దీనివల్ల ఆయిల్ పామ్ రైతులు ఉత్పత్తి చేస్తున్న ఫ్రెష్ ఫ్రూట్ బంచ్‌లకు గిట్టుబాటు ధర లభించడం లేదని వివరించారు. దీర్ఘకాలిక పంట అయిన ఆయిల్ పామ్ సాగుకు రైతులు భారీగా పెట్టుబడులు పెడుతున్న నేపథ్యంలో ధరల అనిశ్చితి రైతుల్లో ఆందోళన కలిగిస్తోందన్నారు. దిగుమతి సుంకాన్ని తిరిగి 44 శాతానికి పెంచడం ద్వారా దేశీయ ఆయిల్ పామ్ రైతులకు రక్షణ కల్పించడంతో పాటు, కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఆత్మనిర్భర్ భారత్, ఎడిబుల్ ఆయిల్ స్వయం సమృద్ధి లక్ష్యాలు కూడా సాధ్యమవుతాయని మంత్రులు పేర్కొన్నారు. అలాగే ఆయిల్ పామ్ రైతులకు కనీస గ్యారంటీ ధర విధానాన్ని అమలు చేసే అంశాన్ని కూడా కేంద్రం పరిశీలించాలని కోరారు. తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఆయిల్ పామ్ రైతుల భవిష్యత్తు దృష్ట్యా దిగుమతి సుంకాన్ని పునరుద్ధరించి రైతులకు భరోసా కల్పించాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని మంత్రులు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కేంద్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలంగాణ రైతాంగానికి సంబంధించిన పలు కీలక అంశాలపై వినతిపత్రాలు సమర్పించారు. రాష్ట్రంలో ఈ ఏడాది వానాకాలం వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో డి.ఎ.పి, యూరియా ఎరువుల అవసరం గణనీయంగా పెరిగిందని, కేంద్రం కేటాయించిన కోటాకు మరియు వాస్తవ సరఫరాకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వెంటనే పూడ్చి, రాష్ట్రానికి పూర్తి స్థాయిలో ఎరువులు అందించాలని కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఎరువుల సరఫరాను నిరంతరాయంగా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పప్పుధాన్యాలు, నూనెగింజల కొనుగోళ్లపై ప్రస్తుతం అమలులో ఉన్న 25 శాతం పరిమితి రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నదని పేర్కొన్నారు. రైతులు ఉత్పత్తి చేసిన మొత్తం పంటను కనీస మద్దతు ధర (ఓ÷ఞ) కింద కొనుగోలు చేసే విధంగా కేంద్రం ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుని ఆ పరిమితిని పూర్తిగా తొలగించాలని కోరారు. దీంతో పప్పుధాన్యాలు, నూనెగింజల సాగుకు మరింత ప్రోత్సాహం లభించడంతో పాటు దేశ ఆహార భద్రత, దిగుమతుల తగ్గింపుకు కూడా దోహదపడుతుందని వివరించారు. ఏండి తెలంగాణలో రికార్డు స్థాయిలో సుమారు 15 లక్షల టన్నుల మొక్కజొన్న, 3 లక్షల టన్నుల జొన్నల ఉత్పత్తి నమోదైందని, మార్కెట్ ధరలు కనీస మద్దతు ధర కంటే దిగువకు పడిపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే భారీ ఆర్థిక భారం భరించి మొక్కజొన్న, జొన్నలను కొనుగోలు చేసిందని, ఈ పంటలను కూడా కేంద్ర ప్రభుత్వ కొనుగోలు విధానంలో చేర్చి ఓ÷ఞపై సేకరించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా రసాయనాలు–ఎరువుల శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డాకు తెలంగాణలో ఎరువుల సరఫరా, పోషకాధారిత ఎరువుల సబ్సిడీ విధానంలో మార్పులకు సంబంధించి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల పలు లేఖలు రాయగా.... ఈ వినతులపై స్పందించిన కేంద్ర మంత్రి తెలంగాణలో యూరియా, డి.ఎ.పి. తదితర ఎరువుల లభ్యత, సరఫరాపై కేంద్ర ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తోందని, రాష్ట్ర రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని శాఖ అధికారులను ఆదేశించినట్లు తన లేఖలో పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన అంశాలపై కేంద్రం సానుకూలంగా స్పందించడం రైతాంగానికి ప్రయోజనకరంగా మారుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు తుమ్మల, ఉత్తమ్ ల వెంట ఎంపీలు రఘువీర్ మరియు కొండ విశ్వేశ్వర్ రెడ్డి గారు పాల్గొన్నారు.

# విద్యుత్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన

## కనీసవేతనం అమలు చేయాలి.







**రైల్వే కోడూరు జూన్ 23 రిపబ్లిక్ న్యూస్.**
మండల కేంద్రం రైల్వే కోడూరు విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయం వద్ద విద్యుత్ స్ట్రగుల్ కమిటీ విద్యుత్ కార్మికుల సమస్య పరిష్కారం కోసం నిరసన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు,నాయకులు కె. కిరణ్ కుమార్, సుబ్రమణ్యం,సిహెచ్ నారాయణ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. విద్యుత్ ఉద్యోగుల 2026 ఏప్రిల్ వేతన సవరణ కమిటీ ఏర్పాటు చేయాలని, పెండింగ్ లోఉన్న 3 కరువు భత్యం బకాయిలు వెంటనే చెల్లించాలని, కాంట్రాక్టు కార్మికులను రెగులర్ చేయాలనీ, వారిని సంస్థలో విలీనం చేయాలని, తెలంగాణ తరహాలో కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం 48వేలు చెల్లించాలని, నినాదాలు చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు, స్ట్రగుల్ కమిటీ పిలుపు మేరకు, ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది అని వారు పేర్కొన్నారు. యాజమాన్యం వెంటనే స్పందించి కార్మికుల లో వున్న అశాంతిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ రాష్ట్ర నాయకులు సిహెచ్ .చంద్రశేఖర్ , ఆర్.వెంకటేష్, పాల్గొని, మాట్లాడుతూ, విద్యుత్ సంస్థ ప్రైవేటీకరణ కు వ్యతిరేకంగా పోరాడాలి అన్నారు. ఔట్సోర్స్ కాంట్రాక్ట్ కార్మికులకు సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం సమాన పనికి సమాన వేతనం, రెగ్యులర్ కోసం, పోరాడాలన్నారు. పిఆర్సి, ఐ ఆర్, ఓ పి సి, అమలు చేయాలన్నారు. విద్యుత్ కార్మికుల హక్కుల కోసం, ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.విధుత్ నాయకులు లక్ష్మణరావు. సుబ్రమణ్యం, కుమార్,శ్రీకాంత్, పార్వతి, రమేష్, చందు,శివ, మహేష్, ఈశ్వరయ్య,నరసింహ , సిఐటియు నాయకులు, నాగిపోగు పెంచలయ్య, కేశవులు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు .

## ప్రవేట్ విద్యాసంస్థలపై ప్రభుత్వనియంత్రణా లోపం,అధిక ఫీజులు వసూలు.

**రైల్వే కోడూరు జూన్ 23 రిపబ్లిక్ న్యూస్.**
ప్రైవేట్ కళాశాలలపై ప్రభుత్వ నియంత్రణ పర్యవేక్షణ లోపం వల్ల ప్రైవేట్ కళాశాలలో విద్యార్థిని విద్యార్థుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని వైయస్సార్సీపి రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ మడగలం శ్రీనివాసులు కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు, మంగళవారం ఆయన వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ ఇలా స్పందించారు రాష్ట్రంలో లక్షలాదిమంది పేద,మధ్యతరగతి విద్యార్థులను ప్రవేట్ విద్యాసంస్థల యాజ మాన్యాలు అధిక ఫీజులు వసూలు చేస్తూ వారిని నిలువునా దోచుకుంటున్నాయని నియంత్రించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం,ఆ శాఖ ఉన్నత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ అవినీతి మత్తులో కూరుకు పోయారని శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. జూన్ 12 నుంచి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమయ్యాయని కానీ ఇదే అదునుగా ప్రైవేట్ విద్యాసంస్థలు పేద బాల, బాలికల నుంచి వేల నుంచి లక్షల రూపాయలు ముక్కు పిండి తల్లిదండ్రుల నుంచి ఫీజులు బలవంతంగా వసూలు చేస్తున్నారు. బాల బాలికల విద్య ప్రాథమిక హక్కుగా రాజ్యాంగం చెబుతుంది. 6 నుంచి 16 సంవత్సరాల వరకు ఉచిత మరియు నిర్బంధ విద్య తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వాలు ఎన్నో చట్టాలు చేసినా . ఆంధ్రప్రదేశ్ లో నారాయణ, భాష్యం,చైతన్య విజ్ఞాన్ వంటి ప్రైవేట్ విద్యాసంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టు కొచ్చి ఫీజులు లక్షల్లో వసూలు చేస్తున్నారు.మాజీ సి ఎం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ పాలనలో పేద మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకొని రావాలనే ఉద్దేశంతో శిధిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు నాడు- నేడు పథకం ద్వారా వేలాది పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దడం జరిగింది. అలాగే ప్రవేట్ పాఠశాలల,కాలేజ్ లలో ఫీజులు నియంత్రించడం కోసం జీవో ఎంఎస్53, 54 లను జూన్ 24 తేదీన 2021-2024 వ సంవత్సరంలో జగనన్న ప్రవేశపెట్టారు. ఈ జీవో ప్రకారం గ్రామీణ పంచాయతీ పరిధిలో ఫీజులు ఒకటినుంచి ఐదు తరగతులకు 10వేలు, మున్సిపాలిటీల్లో 11000 కార్పొరేషన్ లో 12000 కాగా 6 నుంచి 10 తరగతులు వరకు పంచాయతీలో 12 వేలు,మున్సిపాలిటీలో 15 కార్పొరేషన్ల 18 వేల రూపాయలు ఫీజులుగా రాష్ట్ర ప్రభుత్వం జీవోలు నిర్ణయించింది. అదేవిధంగా కాలేజీలలో ఇంటర్ విద్యార్థులకు ఫీజులు 15000, 17000, 20,000 వేలు గా నిర్ధారించింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంకి ప్రైవేటు కళాశాలలపై నియంత్రణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా ఫీజులను లక్షల్లో పేద విద్యార్థుల నుంచి వసూలు చేయడం దారుణమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రాష్ట్రంలోనే ప్రైవేట్ కళాశాలల పై ఉక్కు పాదం మోపాలని ఆయన కోరారు.



## కర్నూలు అభివృద్ధిపై సీఎం చంద్రబాబును ప్రశ్నించిన కాంగ్రెస్

### నీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు, ఉద్యోగాల హామీల అమలుపై సమాధానం చెప్పాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు క్రాంతి నాయుడు డిమాండ్



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 23)**
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కర్నూలు జిల్లాకు పలుమార్లు వచ్చినప్పటికీ ఇచ్చిన హామీలు ఎంతవరకు అమలయ్యాయో ప్రజలకు వివరించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, న్యాయవాది క్రాంతి నాయుడు బోయ డిమాండ్ చేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడారు.పత్తికొండ నియోజకవర్గంలోని జొన్నగిరి గోల్డ్ మైన్స్ ప్రాజెక్టు సందర్శన కోసం ముఖ్యమంత్రి జిల్లాకు వస్తున్న నేపథ్యంలో, జిల్లాకు సంబంధించిన కీలక సమస్యలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. గోల్డ్ మైన్స్ ప్రాజెక్టులో స్థానిక రైతులు భూములు కోల్పోయారని, స్థానిక యువతకు ఆశించిన స్థాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పించలేదని ఆరోపించారు. ప్రాజెక్టులో స్థానికులకు ఎంతమంది ఉద్యోగాలు ఇచ్చారో, ఎంతమంది ఇంజనీర్లకు అవకాశాలు కల్పించారో వెల్లడించాలని డిమాండ్ చేశారు.గోల్డ్ మైన్స్ లీజుకు దశాబ్దం పూర్తవుతున్నప్పటికీ స్థానిక యువతకు వృత్తి విద్యా శిక్షణలు అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. మైనింగ్ కార్యకలాపాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయని, ఉత్పత్తి, ఆదాయం విషయంలో అధికారులు మరియు కంపెనీ వేర్వేరు వివరాలు చెబుతున్నారని పేర్కొన్నారు.
కర్నూలు జిల్లా అభివృద్ధి కోసం వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టులకు తగిన నిధులు విడుదల చేయాలని, ఆసుపత్రుల అభివృద్ధితో పాటు ఆదోని మెడికల్ కళాశాలకు నిధులు కేటాయించాలని కోరారు. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన జిల్లాల్లో కర్నూలు ఒకటిగా మిగిలిపోయిందని, పరిశ్రమల స్థాపనలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.
కియా తరహా పెద్ద పరిశ్రమలను జిల్లాకు తీసుకురావడంలో ప్రభుత్వం చొరవ చూపలేదని, విద్య మరియు ఉపాధి కోసం యువత ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి కొనసాగుతోందని అన్నారు. ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూర్చే అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెట్టకుండా ప్రైవేట్ కంపెనీల కోసం ఆర్భాట కార్యక్రమాలు నిర్వహించడం సమంజసం కాదని విమర్శించారు.
ఈ కార్యక్రమంలో కోడుమూరు కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు బి. బతుకన్న, ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ డి.వి. సాంబశివుడు, ఎస్సీ సెల్ మాజీ జిల్లా చైర్మన్ ఈ. లాజరస్, ఐఎన్టీయూసీ సిటీ అధ్యక్షుడు రేపల్లె ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

# రైతన్న మీకోసం వారోత్సవాలు విజయవంతం

## ఎల్‌నీనో ప్రభావంపై రైతులకు కీలక సూచనలు

### AP AIMS యాప్ వినియోగం, APFR నమోదు తప్పనిసరి: వ్యవసాయ అధికారి ఉషారాణి



**దేవనకొండ, జూన్ 23( ప్రజా రిపబ్లిక్ న్యూస్ ):-**
దేవనకొండ మండల కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి బి. ఉషారాణి ఆధ్వర్యంలో "రైతన్న మీకోసం వారోత్సవాలు" కార్యక్రమం నిర్వహించారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో "రైతన్న మీకోసం ఇంటింటి వారోత్సవాలు" మరియు "గ్రామ రైతు వేడుకలు" కార్యక్రమాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.
ఈ సందర్భంగా రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, వివిధ విత్తన రకాలు, పంటలలో వచ్చే తెగుళ్ల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. రైతులకు ఉన్న సందేహాలను నివృత్తి చేస్తూ, ఆయా పంటలకు అనుగుణమైన సాగు సలహాలను ఉచితంగా అందించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకాలతో పాటు ఇతర రైతు సంక్షేమ పథకాలపై పూర్తి వివరాలు, అర్హతలు మరియు వాటి ప్రయోజనాలను రైతులకు వివరించారు.పంటలపై ఎల్‌నీనో ప్రభావం గురించి మాట్లాడుతూ, ఈ ఏడాది వర్షపాతం సాధారణం కంటే తగ్గే అవకాశం ఉందని, దీనివల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడి వ్యవసాయం, పశు వర్ధక రంగాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశముందని తెలిపారు. అందువల్ల తక్కువ నీటితో సాగు చేయగల చిరుధాన్య పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని రైతులకు సూచించారు.అలాగే AP AIMS యాప్ ద్వారా రైతులు యూరియా, డీఏపీ వంటి ఎరువుల లభ్యత వివరాలుతెలుసుకోవడంతో పాటు పంటలకు సంబంధించిన శాస్త్రీయ, సాంకేతిక సలహాలు పొందవచ్చని పేర్కొన్నారు. ప్రతి రైతు (ఆంధ్రప్రదేశ్ ఫార్మర్ రిజిస్ట్రేషన్)లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ విజయ భాస్కర్ గౌడ్, సొసైటీ చైర్మన్ రాజశేఖర్ గౌడ్, టీడీపీ నాయకులు ఆకుల వీరేష్, ఉచ్చురప్ప, రాజాసాబ్, బండ్లయ్య, జనసేన నాయకుడు ఉచ్చురప్ప, వ్యవసాయ విస్తరణ అధికారులు రంగన్న, మల్లికార్జున, వీఏఏలు కళావతి, హసీనా తదితరులు పాల్గొన్నారు. రైతులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ట్వీన్ బిన్స్ నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

### ప్రతి రోజూ శుభ్రపరచి పరిశుభ్రంగా ఉంచాలి: కమిషనర్ చల్లా ఓబులేసు





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 23)**నగరంలోని ప్రధాన రహదారులు, వాణిజ్య ప్రాంతాలు, ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ట్వీన్ బిన్స్‌ను ప్రతిరోజూ శుభ్రం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు.చెన్నమ్మ సర్కిల్, స్వామిరెడ్డి నగర్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ట్వీన్ బిన్స్‌లో చెత్త పేరుకుపోకుండా సకాలంలో ఖాళీ చేయడంతో పాటు వాటిని పరిశుభ్రంగా నిర్వహించాలని సూచించారు.నగర పరిశుభ్రత పరిరక్షణలో ట్వీన్ బిన్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయని, వాటి నిర్వహణపై పారిశుధ్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని కమిషనర్ పేర్కొన్నారు. అలాగే ప్రజలు తడి, పొడి వ్యర్థాలను వేర్వేరుగా బిన్స్‌లో వేస్తూ నగర పరిశుభ్రతకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ పరిశీలన కార్యక్రమంలో శానిటేషన్ సూపర్వైజర్ రమేష్ బాబు, ఇన్‌స్పెక్టర్లు జిలాని, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ దేవత ఆలయ అభివృద్ధికి డాక్టర్ పత్తి హిమబిందు చేయూత



**గుంతకల్లు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 23)**గుంతకల్లు మండలంలోని దోసలూడికి గ్రామంలో ఉన్న శ్రీ సుంకులమ్మ దేవాలయ నిర్మాణం కోసం లితెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ పత్తి హిమబిందు గారులి రూ.10,000 నగదు విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, టిడిపి నాయకులు, బండారి పురుషోత్తం గుంతకల్లు టీడీపీ అసెంబ్లీ అధికార ప్రతినిధి, ఆదినారాయణ,నాగేంద్ర, ఇసాక్, ఓంకారి, రంగస్వామి, వీరేశు, సీనప్ప, పందు తదితరులు పాల్గొన్నారు.

## కసాపురం ఆలయ నూతన ధర్మకర్త కు శుభాకాంక్షలు

### చిప్పగిరి మండల జనసేన కన్వీనర్ కే.చిరంజీవి





**చిప్పగిరి, జూన్, 23( రిపబ్లిక్ న్యూస్)** చిప్పగిరి జనసేన మండల నాయకులు కే.చిరంజీవి గుంతకల్ నియోజకవర్గం కసాపురం ఆలయ నూతన ధర్మకర్త గా ఎన్నికైనందున శ్రీ అంతాచార్యులు స్వామి కి గృహములో కలిసి శుభాకాంక్షలు తెలిపామని మంగళవారం విలేకరుల సమావేశంలో కే. చిరంజీవి తెలిపారు, ఈ కార్యక్రమంలో చిప్పగిరి లక్ష్మీకాంత్, సందీప్, నవీన్, శ్రీధర్ రెడ్డి ,గోవర్ధన్, మనోజ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్యుమరేషన్ పత్రాల పంపిణీలో సందేహం వద్దు.

### తహసీల్దార్ ఆకుల సిద్దేశ్వరరావు





**రైల్వే కోడూరు జూన్ 23 రిపబ్లిక్ న్యూస్.**
ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీలో రాజకీయ నాయకులు,పార్టీలు, ప్రజలు ఎలాంటి సందేహాలకు లోను కావద్దని తహసీల్దార్ ఆకుల సిద్దేశ్వరరావు అన్నారు, నియోజకవర్గంలోని ఓబులవారిపల్లి మండలం మంగంపేట గ్రామపంచాయతీలో 154,155,156 పోలింగ్ బూత్ లకు సంబంధించి కొన్ని గతంలో మైనింగ్ విస్తరణ లో భాగంగా 2002 సంవత్సరంలో మ్యాపింగ్ అయిన ఓట్లకు ప్రస్తుత ఓట్లకు కు అడ్రస్సులు సరిగా లేకపోవడం, మైనింగ్ విస్తరణలో భాగంగా కొన్ని గ్రామాల ఇతర ప్రాంతాలకు తరలించడం జరిగిందని, వాటికి సంబంధించి సుమారు 800 ఓట్లు పైచిలుకు అడ్రస్సులు మారడం జరిగింది ఆ ఓట్ల కోసం బిఎల్ఓ తో బిఎల్ఎ మరియు రాయలసీమ జోనల్ బూత్ కమిటీ అధ్యక్షులు తల్లెం భరత్ కుమార్ రెడ్డి కలిసి వాటి యొక్క అడ్రస్సులు ఏన్యూమరేషన్ పత్రాలు అందించే దానికి అధికారులతో చర్చించడం జరిగినది, ఎన్యుమరేషన్ పత్రాలు ఎలాంటి లోటుపాట్లు లేకుండా అందరికీ అందివ్వడం జరుగుతుందని ఈ విషయంలో రాజకీయ పార్టీలు గాని నాయకులు గాని ఎలాంటి సందేహాలకు లోనవ్వద్దని తాసిల్దార్ ఆకుల సిద్దేశ్వర తెలియజేశారు,ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి మల్లికార్జున రెడ్డి,బిఎల్ఎ శీను, చంటి, అద్దె వెంకటేష్, భార్గవి ,బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమ్ రిజిస్ట్రేషన్ వర్క్ షాప్ కు మంచి స్పందన




**చౌడేపల్లి ప్రతినిధి జూన్ 23 రిపబ్లిక్ న్యూస్**
చౌడేపల్లి వెలుగు కార్యాలయం స్త్రీ శక్తి భవన్ నందు ఏ. పి.ఎమ్. మరియు జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో ఉద్యమ్ రిజిస్ట్రేషన్ వర్క్ షాప్ కు మంచి స్పందన లభించిందని నిర్వాహకులు పరిశ్రమల ప్రోత్సాహిక అధికారి కె.నాగార్జున తెలిపారు. ఉత్పత్తి, సేవా మరియు వ్యాపార పరిశ్రమల రంగాలలో వారికి అవసరమైన ఉద్యమ్ రిజిస్ట్రేషన్ పై అవగాహన కల్పించారు. సహాయ సంచాలకులైన డి శంకరప్ప గారు మాట్లాడుతూ మంచి వ్యాపార ప్రణాళికలతో అవగాహనతో ముద్ర, పి.ఎమ్. ఇ జి.పి. పి ఎం ఎఫ్ ఎం ఈ వంటి ప్రభుత్వ పథకాల ద్వారా బ్యాంకు రుణాలు పొంది వ్యాపారవేత్తలుగా ఎదగాలన్నారు. వెలుగు ఏ.పి.ఎం. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆహార ఉత్పత్తి రంగంలో సబ్సిడీ లభిస్తుందని ముద్ర, పి.ఎం.ఈ.జి8.పి., ఫుడ్ ప్రాసెసింగ్ పథకాల ద్వారా మహిళా పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి ప్రతి మహిళ ప్రయత్నించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిసి లు కార్యక్రమంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, యనిమేటర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

# తాట తీస్తాం అంటూ పవన్ కళ్యాణ్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు

## తీవ్రంగా ఖండించిన వైసిపి రాష్ట్ర బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్

**తాటతీస్తాం .. తోలుతీస్తాం**

**అరచేతుల్లో రేఖలు లేకుండా చేస్తాం**

**వైసిపి గుండాల్లారా .. రౌడీల్లారా**

**ఇది పవన్ కళ్యాణ్ పూటకో సిద్ధాంతం రాద్ధాంతం**

**పంతం నానాజీని బట్టలూడదీసి కొట్టారు మరిచారా**

**రాష్ట్ర బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్**



**అనంతపురం ప్రతినిధి, జూన్ 23,(రిపబ్లిక్ న్యూస్):** తాటతీస్తాం .. తోలుతీస్తాం వైసీపీ వైసిపి గుండాల్లారా .. రౌడిల్లారా అంటూ పవన్ కళ్యాణ్ రెచ్చగొట్టే వ్యాఖ్యలను వైసిపి రాష్ట్ర బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. ఇది పవన్ కళ్యాణ్ పూటకో రాద్ధాంతం సిద్ధాంతమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా గతంలో వైసిపి పార్టీ నాయకులు పంతం నానాజీని బట్టలూడదీసి కొట్టారని అతను కూడా మా నాయకుడు వైయస్ జగన్మోహన్ రెడ్డిని మాట్లాడుతున్నాడన్నారు. మంగళవారం ఉదయం 10:30 గంటలకు వైయస్సార్సీపి పార్టీ ప్రధాన కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.

### ప్రజల కోసం చిరునవ్వుతో నిలబడినటువంటి దమ్మున్న నాయకుడు

ఈ సందర్భంగా బీసీ రమేష్ గౌడ్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉంటూ సభ్య సమాజం దించుకునేలా రెచ్చగొట్టే మాటలు మాట్లాడుతున్నారని, వీళ్ళనా ప్రజలు మెచ్చి డిప్యూటీ సీఎంను చేసిందేదంటూ వ్యాఖ్యానించారు. 15 ఏళ్లుగా పార్టీని పెట్టి ఐదు జెండాలు మార్చి పది సిద్ధాంతాలను మార్చుకొని పక్క పార్టీ నాయకులు త్యాగం చేస్తే కానీ మూడుసార్లు పోటీ చేస్తే ఒకసారి ఎమ్మెల్యే గెలిచినటువంటి నీవు నీకే అంత ఆవేశం ఉంటే, నీవే అలా మాట్లాడుతుంటే ఈ రాష్ట్రంలో చెయ్యని తప్పుకి అక్రమంగా అన్యాయంగా

16 నెలలు జైలు శిక్ష అనుభవించి , పార్టీ పెట్టినప్పటి నుంచి ఇప్పటివరకు మీరు ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినప్పటికీ

ఎన్ని అవమానకర మాటలు మాట్లాడినప్పటికీ కూడా ఒకపక్క సైకోని మాట్లాడుతున్న, ఇంకో పక్క రౌడీ అని మాట్లాడుతున్నా, మరోపక్క గొడ్డలి పార్టీ అని మాట్లాడుతారు, ఇంకోపక్క లక్ష కోట్లని మాట్లాడు తున్నప్పటికీ కూడా తన గుండెల్లో అగ్నిజ్వాలగా రగిలిపోతూ ఉన్నా కూడా ప్రజల సంక్షేమం కోసం, ప్రజల కోసం చిరునవ్వుతో నిలబడినటువంటి దమ్మున్న నాయకుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి అభిమానులుగా మాకెంత ఆవేశం ఉండాలి, మేమెంత రెచ్చిపోవాలన్నారు.

తప్పుడు వాగ్దానాలు ఇచ్చి తప్పుడు మాటలు మాట్లాడేటటువంటి వారు మీరు బెదిరిస్తే .. మేమ్ బెదిరిపోతామా ... మీరు భయపడితే మేము భయపడాలా? ఎవరిని భయపడిస్తున్నావ్ .. ఎవరిని బెదిరిస్తున్నావ్ .. ఎవరి తోలు తీస్తావ్ ..మాట మాట్లాడితే కనీసం నీ పదవకైనా గౌరవిస్తున్నావా అంటూ సూచించారు.

### రోజుకో మాట, పూటకో సిద్ధాంతం ఇది పవన్ కళ్యాణ్ రాద్ధాంతం

రాష్ట్రంలో రాజకీయాల కోసం రోజు రోజుకు దిగజారిపోయి ఒకరోజు ప్రధానమంత్రిని పొగుడుతారు ఒకరోజు విమర్శిస్తారు అంటూ ఎద్దేవా చేశారు. ఒకరోజు కమ్యూనిస్టులు, మరో రోజు చేగువేరా, ఇంకో రోజు సనాతన ధర్మం అంటారని, ఒకరోజు కులం కావాలని ఓ రోజు కులం వద్దు అని రోజుకో మాట, పూటకో సిద్ధాంతం ఇది పవన్ కళ్యాణ్ రాద్ధాంతం అని విమర్శించారు. ఈ రెండు సంవత్సరాలలో మిమ్మల్ని విశ్వసించిన ప్రజలు, నాయకులు కూడా అసహ్యించుకుంటున్నారన్నారు. ఈ స్వతంత్ర భారతదేశంలో ఓ కన్నతల్లి కృష్ణలంక పోలీసులు చుట్టూ తిరిగి అయ్యా మా కొడుకు కనపడలేదు అని అడిగితే సమాధానం లేదన్నారు. ఒకవేళ మీరు చంపి ఉంటే శవాన్ని అప్పగించాలని ప్రాధేయపడినా కూడా స్పందించలేదన్నారు. శవం లేకున్నా కూడా కనీసం బూడిదైనా ఇవ్వండి అంటూ ప్రాధేయపడి జోల పట్టి అడిగిందన్నారు కానీ పోలీసులకు కనికరం లేదన్నారు. అటువంటి కన్నతల్లి బాధ మీకు కనబడలేదా వినపడలేదా అంటూ తీవ్రంగా హెచ్చరించారు.

### ఉప ముఖ్యమంత్రిగా మీరు ఉంటే ఎంత ఊడితే ఎంత

మరోపక్క 30 సంవత్సరాల ఉద్యమ నాయకుడు పేరు పోగు వెంకటేశ్వరరావు కుమారుడు క్రాంతి పోలీసులు పెట్టిన చిత్రహింసలు తట్టుకోలేక మమ్మల్ని చంపేయండి అంటూ ఆత్మహత్య చేసుకున్న పరిస్థితి ఈ రాష్ట్రంలో నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్న లేకపోతే కర్నూలు జిల్లాలో గంగమ్మ .. ఒక కృష్ణలంక పోలీస్ స్టేషన్ ఏ కాదు ఈ రాష్ట్రంలో చాలావరకు 80 శాతం వరకు పోలీస్ స్టేషన్లో ఇదే విధంగా ఉన్నాయని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో ముఖ్యమంత్రిగా ఉప ముఖ్యమంత్రిగా మీరు ఉంటే ఎంత ఊడితే ఎంత. మాట్లాడితే మాకు అనుభవం లేదు, ఇది మా పరిధిలో లేదు, మాకు చేతకాదు... అంటుంటారే పవన్ కళ్యాణ్ మీకే అడుగుతున్నాం .. మీకు చేతనైంది, మీ పరిధిలో ఉంది, మీకు అనుభవంలో ఉంది.. మీకు కేవలం జగన్మోహన్ రెడ్డిని ఇష్టం వచ్చినట్లు తిట్టే దానికోసం మీకు అనుభవం ఉందా అని అన్నారు. లేదా చంద్రబాబు నాయుడు పక్షాన లోకేష్ పక్షాన గొంతు చించుకొని అరిచే అనుభవం ఉందన్నారు.రాష్ట్రంలో ఇన్ని హత్యలు, ఇన్ని ఘోరాలు జరుగుతున్నా , ఇచ్చిన హామీలను అమలు చేయకపోయినా .. ఎక్కడైనా ఎప్పుడైనా నోరు తెరిచి మాట్లాడిన సందర్భం ఉందా..మరి ఎందుకు ఇంత నీకు దిగజారుడు రాజకీయాలన్నారు.

### కూటమికి వ్యతిరేకంగా గళం విప్పితే.. రాజకీయ పన్నాగం

రెండు సంవత్సరాల పరిపాలన పైన విజయోత్సవాలా .. ఎవరైనా సాధించిన విజయాల కోసం విజయోత్సవ సభలు నిర్వహిస్తారని, కేవలం జగన్మోహన్ రెడ్డి తిట్టడానికి మాత్రమే విజయోత్సవ సభలో పెడుతున్నారన్నారు. అదే సందర్భంలో రెండు సంవత్సరాలుగా వెన్నుపోటు దినోత్సవాలను వైయస్సార్సీపి పార్టీ సభలను నిర్వహించిందన్నారు. ప్రజలకు పొడిచినటువంటి వెన్నుపోటు.. ప్రజలకు చేసినటువంటి ద్రోహానికి .. నిరసనగా వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వెన్నుపోటు దినోత్సవాల సభలను నిర్వహిస్తే స్వచ్ఛందంగా ప్రజలు తరలివచ్చి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పితే.. దాన్ని చూసి ఓర్చుకోలేక.. వీటన్నిటిని కూడా దృష్టి మంచి మళ్లించే దిశగా రాజకీయ పన్నాగం పన్నారన్నారు. చివరికి మీ నాయకులను కార్యకర్తలను చిత్రమిహింసలు పెడుతున్నా కూడా మీరు స్పందించ లేనటువంటి దౌర్భాగ్యస్థితిలో ఉన్నారన్నారని .. మీరా మమ్మల్ని బెదిరించేదన్నారు. మీరు బెదిరిస్తే .. మీరు రెచ్చగొడితే మేము వెనకడగేస్తామా..

### జగన్ నాయకత్వంలో సామాజిక న్యాయానికి పెద్దపీట

ఈ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో ప్రజల పక్షాన, ప్రజల గొంతుకు గా నిలబడటానికి జగనన్న సైన్యం ఒకటి ఉందని గుర్తుపెట్టుకో పవన్ కళ్యాణ్. మీ తాటాకు చప్పళ్లకు భయపడేటువంటి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కాదన్నారు. మీరు ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని ఇబ్బందులు పెట్టినా, మీరు ఎన్ని అరెస్టులు చేసినా.. ప్రజల పక్షాన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ, వైయస్ జగన్మోహన్ రెడ్డి

ఉన్నంతకాలం మీ అవాకులు చవాకులు ఈ రాష్ట్రంలో ఉండవు, ఉండబోవు అని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రజానీకం మేలుకోవాలని, ఈ రాష్ట్రంలో జరుగుతున్న అనేక పరిణామాలు తీవ్రంగా ఆలోచింపజేసే దిశగా ఉన్నాయంటూ.. ఇన్ని హత్యలు, ఇన్ని ఆత్మహత్యలు, ఇన్ని లాకప్ డెత్ లు జరుగుతున్నా , ఈ ప్రజల పట్ల, ఈ రాష్ట్రం పట్ల మీ సమాధానం ఏంటని అడుగుతున్నారు. మా చదువులకు సంబంధించినటువంటి ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు ఎక్కడా అని విద్యార్థులు అడుగుతున్నారన్నారు. మహిళా సంక్షేమం అని అన్నారు. ఎన్నో హామీలు ఇచ్చారు వాటి పరిస్థితి ఏంటని మహిళలు అడుగుతున్నారన్నారు. నిరుద్యోగులు అడుగుతున్నారు మా ఉద్యోగాలు ఎక్కడ అని, రైతన్నలు అడుగుతున్నారు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి అని, మా డి ఏ లు మా పిఆర్సి లు ఏమైనాయని ఉద్యోగులు అడుగుతున్నారని వీటన్నిటికీ మీ నుంచి సమాధానం కోరుకుంటున్నారన్నారు.

అంతేగాని మీరు రెచ్చిపోయేటట్లు రెచ్చగొట్టేటట్లు మాటలు మేము ఆశించడం లేదు ప్రజల ఆశించడం లేదన్నారు. ఇచ్చినటువంటి హామీలను అమలు చేస్తారా,అమలు చేయకుంటే ఎందుకు ఇలాంటి హామీలు ఇచ్చారు.. ఈ దేశంలో ఎక్కడా జరగ నటువంటి లా అండ్ ఆర్డర్ సమస్య ఈ రాష్ట్రంలో వస్తోందన్నారు. నాకు హోం శాఖ ఉంటేనా అని పవన్ కళ్యాణ్ మాట్లాడారని ఆయనకు హోం శాఖను కట్టబెట్టండి అని ఎద్దేవా చేశారు. ఇప్పటికే 80 శాతం ప్రజలకు పవన్ కళ్యాణ్ నిజస్వరూపం తెలిసిపోయిందని, తొందరగా ఆ 20 శాతం మంది ప్రజలు కూడా తెలిసిపోతుందని అంటే ఈ రాష్ట్రంలో హోం శాఖ విఫలమైందని మీరు ఒప్పుకుంటున్నారు కదా ...ప్రజలు నమ్మి ఆశపడి మీరు ఇచ్చినటువంటి అబద్ధపు హామీలకు ఓట్లు వేస్తే .. గెలిచిన తర్వాత ఇంత దౌర్భాగ్యమైనటువంటి పరిపాలన చేస్తూ చివరికి మనుషులను చంపుతున్నారు.

మనుషులు ఆత్మహత్యలను చేసుకునే విధంగా ప్రేరేపిస్తున్నారు అంటే .. ఈ రాష్ట్రంలో ఉన్నటువంటి పరిస్థితుల్లో ఎంత భయంకరంగా ఉన్నాయో కేంద్ర ప్రభుత్వం ఆలోచించాలని, రాష్ట్రపతి కూడా ఆలోచించాలని అన్నారు. ఏది ఏమైనప్పటికీ ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నామని గుర్తుపెట్టుకోవాలన్నారు. గత వైసిపి పాలనలో ఐదు మంది ఉపముఖ్యమంత్రులు ఉన్నారని, జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో సామాజిక న్యాయానికి పెద్దపీట వేసామని,అప్పుడు ఏ ఉపముఖ్యమంత్రి మీ మదర్ రెచ్చగొట్టేటట్టు మాట్లాడలేదు, ప్రజల సమస్యలను పట్టించుకోకుండా పారిపోలేదన్నారు. ఇవాళ రాష్ట్రం వదిలిపెట్టి పవన్ కళ్యాణ్ పారిపోయారని, మీ సిద్ధాంతాలను మార్చుకొని, సనాతన ధర్మమని, ఇవాళ జాతీయమని, ప్రాంతీయమని అన్నీ అయిపోయాయి .. కాబట్టి చివరిగా సూటిగా చెప్తున్నాం అయితే చంద్రబాబు నాయుడుకు మీకు ఎన్నో లావాదేవీలు ఉండొచ్చు కానీ.. వైయస్సార్సీపి పార్టీ నాయకులను, కార్యకర్తలను మా అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మాట్లాడితే మాత్రం ఉపేక్షించమని హెచ్చరించారు. ఈ సందర్భంగా ప్రజలు కూడా ఒక సారి ఆలోచన చేయాలని,

ఈ పాలకుల గురించి మనకు అర్థమైందని ఈ రెండు సంవత్సరాలు కాలంలో జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో గట్టిగా నిలబడదాం పోరాటం చేద్దాం ఈ కూటమి ప్రభుత్వాన్ని కూకటి వేళ్ళతో పెకలించే దానికోసం అందరం సన్నద్ధమవుదాం. భవిష్యత్తులో జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకొని ఈ రాష్ట్ర అభివృద్ధికి తోడ్పాటు అందిద్దామని రాష్ట్ర ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు.

# చిట్టి తల్లులూ.. బంగారు భవిష్యత్ మీదే

**బాలసదనం విద్యార్థినులతో ఐసీడీఎస్ ఆర్జేడీ మనో రంజని - సూపరింటెండెంట్, సిబ్బందిని అభినందించిన ఆర్జేడీ**





**అనంతపురం సంక్షేమం, జూన్ 23,(రిపబ్లిక్ న్యూస్):** చిట్టి తల్లులూ బంగారు భవిష్యత్ మీదే. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని క్రమశిక్షణ, పట్టుదలతో చదవండి.. అంటూ ఐసీడీఎస్ కర్నూలు రీజియన్ ఆర్జేడీ మనో రంజని అన్నారు. అనంతపురం జిల్లా పర్యటన నిమిత్తం కర్నూలు రీజనల్ కార్యాలయ ఏసీడీపీఓ సౌజన్య, సూపరింటెండెంట్ మంజులవాణితో కలసి మంగళవారం వచ్చారు. ఈ సందర్భంగా బుడ్డప్పనగర్ లోని బాలసదనం సందర్శించారు. ఐసీడీఎస్ పీడీ శశికళ, తాడిపత్రి సీడీపీఓ సాజిదా, డీసీపీఓ మంజునాథ్ తో కలసి బాలసదనం సందర్శించారు. బాలసదనం చిన్నారులు తమ చిట్టి చేతులతో రంగు రంగుల కాగితాలతో తయారు చేసిన బొకే అందించి స్వాగతం పలికారు. చిట్టి చేతులతో అందమైన ఆకారంతో రూపొందించిన కాగితపు బొకేలు చూసి ఆర్జేడీ ముచ్చటపడ్డారు.

**రూ.10 లక్షలతో ఆధునీకరించిన లైబ్రరీ, డార్మెటరీ పరిశీలన**

చిన్నారుల్లోని సృజనను వెలికితీసి, ఇటువంటి తయారు చేసేలా తర్ఫీదునిచ్చిన సూపరింటెండెంట్ ఖాజీ రఫీ మున్నీసా, ఆర్ట్, క్రాఫ్ట్ టీచర్లు రాజేశ్వరి, ఎడ్యుకేటర్ ఆదిలక్ష్మిని ఆర్జేడీ అభినందించారు. మరిన్ని అంశాల్లో చిన్నారులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఆ తరువాత చిన్నారులతో ఆర్జేడీ ప్రత్యేకంగా మాట్లాడారు. జీవితంలో పెద్దయ్యాక..ఏం కావాలనుకుంటున్నారని అడిగ్గా వారిచ్చిన సమాధానాలు విని ఆర్జేడీ ఆశ్చర్యపోయారు. మీరు ఎక్కడి నుంచి వచ్చారో..ఏమో.. మీ నేపథ్యం ఏంటో అవసరం లేదు. పట్టుదలతో చదివి..మీరు అనుకున్న లక్ష్యం చేరుకుంటే మీకు సమాజంలో సముచిత స్థానం, గౌరవంతో పాటు భవిష్యత్ బంగారంగా ఉంటుందన్నారు. ఆ ఆ తరువాత బాలసదనంలో రూ.10 లక్షలతో ఆధునీకరించిన లైబ్రరీ, డార్మెటరీ, కిచెన్ రూమ్, సిక్ రూమ్, క్లాస్ రూమ్ పరిశీలించారు. ఆవరణమంతా కలియదిరిగారు. వివిధ రకాల మూల మొక్కలు, పచ్చదనంతో స్వాగతం పలికేలా ఉన్న వాతావరణం చూసి ఆర్జేడీ మురిసిపోయారు. ఇక్కడి వాతావరణం చూస్తుంటే తనకు బాల్యం గుర్తుకొస్తోందని మనసులోని మాట బయటపెట్టారు. కార్యక్రమంలో అకౌంటెంట్ ఫాతిమా, సిబ్బంది మాధవి, శైలమణి, అమీనా పాల్గొన్నారు. అంతకు ముందు శిశుగృహ సందర్శించారు. ఓ శిశువును చెన్నైకి చెందిన దంపతులకు దత్తత ఇచ్చారు.

**గతంలో వచ్చిన పలు ఆరోపణలపై ముగిసిన విచారణ**

అనంతపురం అర్బన్ ఐసీడీఎస్ కార్యాలయానికి ఆర్జేడీ మనోరంజని, కర్నూలు ఏసీడీపీఓ సౌజన్య, సూపరింటెండెంట్ మంజుల వాణి, ఐసీడీఎస్ పీడీ శశికళతో ఉదయమే చేరుకున్నారు. గతంలో వచ్చిన పలు ఆరోపణలపై విచారణ చేశారు. నివేదికను ప్రభుత్వానికి పంపుతామని ఆర్జేడీ వివరించారు.

## చౌడేపల్లి ట్రాఫిక్ తో తీవ్ర అంతరాయం

**చౌడేపల్లి ప్రతినిధి జూన్ 23ప్రజా రిపబ్లిక్ న్యూస్**

చౌడేపల్లి తిరుపతి ప్రధాన రహదారిపై చౌడేపల్లి సర్కిల్ లో నిత్యం వాహనాలు, జనసంచారంతో రద్దీగా ఉంటుంది. అయితే రహదారిపై ట్రాఫిక్ సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది. రద్దీ సమయాల్లో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగి ప్రయాణ సమయం పెరుగుతోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదీ కాక మంగళవారం సంత దినం కాబట్టి చౌడేపల్లి మండలం లోని అన్ని గ్రామాల నుండి ప్రజలు పట్టణానికి రావడంతో ట్రాఫిక్ వల్ల సుమారు అరగంటసేపు బస్టాండ్ వాహనాలతో నిండిపోయింది. ఎస్ఐ చిన్న రెడ్డప్ప తన సిబ్బందితో వచ్చి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేశారు. రోడ్డుపై సరైన నిర్వహణ లేకపోవడం, ఆర్టీసీ బస్సులు ఆర్టీసీ బస్టాండ్ కు వెళ్లకపోవడం, బోయకొండ బస్సు సర్కిల్ లోనే ఆపడం, అక్రమ పార్కింగ్‌లు, ఇరుకైన మార్గం, రహదారిపై వ్యాపార కార్యకలాపాలు వంటి కారణాలు ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణాలుగా మారాయని స్థానికులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



## రైల్వే స్టేషన్ కు చక్రాల కుర్చీలు అందించిన లయన్స్ క్లబ్

**. ఐక్యరాజ్యసమితి ప్రజా సేవా దినోత్సవం పురస్కరించుకుని.**

**. నంద్యాల రైల్వే స్టేషన్ కు చక్రాల కుర్చీలు రెండు అందజేసిన నంద్యాల లయన్స్ క్లబ్**

**. చక్రాల కుర్చీల దాతలు ఆత్మకూరు సుదర్శనం శెట్టి, భవనాసి నాగ మహేష్.**




**నంద్యాల జూన్ 23 (రిపబ్లిక్ న్యూస్) :** ఐక్యరాజ్యసమితి ప్రజాసేవ దినోత్సవం సందర్భంగా నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రైల్వే స్టేషన్ కు ప్రయాణికుల సౌకర్యార్థం చక్రాల కుర్చీలు రెండు అందజేశారు. నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేశుల నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లయన్స్ జిల్లా వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొనగా, దాతలు నంద్యాల లయన్స్ క్లబ్ వ్యవస్థాపక సభ్యులు ఆత్మకూరు సుదర్శనం శెట్టి, సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు భవనాసి నాగ మహేష్ లు చక్రాల కుర్చీలు రైల్వే స్టేషన్ మేనేజర్ చంద్రశేఖర్ కు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ నంద్యాల లయన్స్ క్లబ్ నిరంతర సేవా కార్యక్రమాలను గత 56 సంవత్సరాలుగా చేస్తున్నదని భవిష్యత్తులో కూడా ఈ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని అన్నారు. ఆత్మకూరు సుదర్శనం శెట్టి, భవనాసి నాగ మహేష్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందజేస్తామని తెలిపారు. రైల్వే స్టేషన్ మేనేజర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ దివ్యాంగులకు, వృద్ధులకు ఈ చక్రాల కుర్చీలు చాలా ఉపయోగపడతాయని అన్నారు. లయన్స్ క్లబ్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వే స్టేషన్ మాస్టర్ చంద్రశేఖర్, నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేశుల నాగరాజు, కోశాధికారి అమిదేల జనార్ధన్, సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ గెలివి సహదేవుడు,లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ మరియు రైల్వే క్రూ కంట్రోలర్ రవి ప్రకాష్, లోకో పైలట్ రామన్న, నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు, లయన్స్ క్లబ్ సభ్యులు ఎంపీవి రమణయ్య, లయన్స్ క్లబ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ యూసుఫ్,నూతన కార్యదర్శిగా ఎంపికైన మేడా చంద్రశేఖర్, పారిశ్రామికవేత్త ఆత్మకూరు రవి పాల్గొన్నారు.

## రక్తదాన సేవల్లో కర్నూలు జీజీహెచ్‌కు జాతీయ గౌరవం

**ఎన్బిటిసి జాతీయ అవార్డు అందుకున్న రక్తకేంద్రం**

**రాష్ట్రంలో ప్రథమ స్థానంతో విశిష్ట గుర్తింపు**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 23)**
మార్పిడి సేవల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) రక్తకేంద్రం జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక గుర్తింపును అందుకుంది. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ రక్త మార్పిడి మండలి (ఎన్బిటిసి ) ఆధ్వర్యంలో ఈ నెల 16న గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో నిర్వహించిన జాతీయ కార్యక్రమంలో కర్నూలు జీజీహెచ్ రక్తకేంద్రానికి జాతీయ అవార్డు ప్రదానం చేశారు.రక్తదాన సేకరణ, స్వచ్ఛంద రక్తదాన శిబిరాల నిర్వహణ, రక్త మార్పిడి సేవల విస్తరణలో అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకు ఈ అవార్డు లభించింది. కర్నూలు జీజీహెచ్ రక్తకేంద్రం ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా 42 స్వచ్ఛంద రక్తదాన శిబిరాలను నిర్వహించడంతో పాటు, 13,546 యూనిట్ల స్వచ్ఛంద రక్తదానాలను సేకరించి రాష్ట్రంలో ప్రథమ స్థానాన్ని సాధించింది. ఈ విశేష విజయాన్ని గుర్తించిన జాతీయ రక్త మార్పిడి మండలి అవార్డుతో సత్కరించింది.
ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కె. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో ఈ గుర్తింపు లభించడం ఆసుపత్రికి గర్వకారణమని అన్నారు. రక్తకేంద్ర వైద్యులు, సిబ్బంది, స్వచ్ఛంద రక్తదాతలు, సేవా సంస్థలు, ప్రజల సహకారంతోనే ఈ ఘనత సాధ్యమైందని పేర్కొన్నారు.
కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి, ప్రొఫెసర్ మరియు హెచ్‌ఓడీ డా. జి. బాలేశ్వరి, అసోసియేట్ ప్రొఫెసర్ డా. ఎస్. సునీత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా. షేక్ షహనాజ్, డా. సి. రవికాంత్, కౌన్సిలర్ కిరణ్, ల్యాబ్ టెక్నీషియన్లు జగదీశ్వర్ రెడ్డి తదితరులు, స్టాఫ్ నర్సులు గేరా సుజాత, ఇందిరా విశ్వాసమ్మ పాల్గొన్నారు.జాతీయ అవార్డు అందుకోవడం ద్వారా కర్నూలు జీజీహెచ్ రక్తకేంద్రం రాష్ట్రానికే కాకుండా దేశవ్యాప్తంగా ఆదర్శవంతమైన రక్తదాన సేవా కేంద్రంగా గుర్తింపు పొందింది.

## ఐక్యతతో క్రీడాకారుల సంక్షేమానికి కృషి చేద్దాం

**ప్రపంచ ఒలింపిక్ డే రన్‌లో 1500 మంది క్రీడాకారుల ఉత్సాహభరిత పాల్గొనిక**







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 23)**
క్రీడాకారుల సంక్షేమం కోసం అందరూ ఐక్యంగా పనిచేయాలని ఏపీ ఎస్పీ డీఎస్పీ మహబూబ్ బాషా, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు నాగరత్నమయ్య పిలుపునిచ్చారు. ప్రపంచ ఒలింపిక్ డే సందర్భంగా కర్నూలు జిల్లా ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఒలింపిక్ డే రన్‌లో సుమారు 1500 మంది విద్యార్థులు, క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.
కర్నూలు కొండారెడ్డి బురుజు వద్ద జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కృష్ణ, రోటరీ క్లబ్ అధ్యక్షుడు ప్రసాద్ గుప్తా, ఆర్ఎస్ఐ నాగస్వామి, రాయలసీమ విశ్వవిద్యాలయ క్రీడల సమన్వయకర్త డాక్టర్ శివకిషోర్, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు డాక్టర్ రుద్రరెడ్డి, అవినాష్ శెట్టి, ఈశ్వర్ నాయుడు, సురేష్ గౌడ్, సునీల్ కుమార్ తదితరులు క్రీడాజ్యోతిని వెలిగించి రన్‌ను ప్రారంభించారు.
కొండారెడ్డి బురుజు నుంచి ప్రారంభమైన ఈ రన్ కిడ్స్



వరల్డ్, రాజ్‌విహార్, మౌర్య ఇన్, ఆర్ఎస్ సర్కిల్, ఎస్‌టిబిసి కళాశాల మీదుగా కర్నూలు అవుట్‌డోర్ స్టేడియానికి చేరుకుంది.
ముగింపు సభలో డీఎస్పీ మహబూబ్ బాషా మాట్లాడుతూ క్రీడాకారులు ప్రతిరోజూ క్రమశిక్షణతో సాధన చేసి తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా క్రీడాకారులకు విశేష గుర్తింపు లభిస్తోందని, తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను చదువుతో పాటు క్రీడల వైపు ప్రోత్సహించాలని అన్నారు.
జిల్లా ఒలింపిక్ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు నాగరత్నమయ్య మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు 28 క్రీడాంశాల్లో పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. అలాగే భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పి. టి. ఉష సూచనల మేరకు కర్నూలు నగరంలో 2036 మొక్కలు నాటేందుకు కార్యాచరణ రూపొందించినట్లు వెల్లడించారు.
అనంతరం అంతర్ పాఠశాలల క్రీడా పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.
ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు గౌతమ్ రెడ్డి, క్రీడా సంఘాల ప్రతినిధులు పాండురంగారెడ్డి, శ్రీధర్, రవికుమార్, మాధవరావు, లోకేష్, రమణయ్య, శ్రీరాములు యాదవ్, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పేద కుటుంబానికి అండగా నిత్యసురభి ట్రస్ట్

**రెండు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువుల పంపిణీ**

**ఆపదలో ఉన్నవారికి చేయూతనివ్వాలి**

**చైర్మన్ డాక్టర్ ఎస్. నిర్మలమురళి**

**అనంతపురం ప్రతినిధి, జూన్ 23,(రిపబ్లిక్ న్యూస్):**
సేవే పరమోపకారం అని నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం చైర్‌పర్సన్ డాక్టర్ ఎస్. నిర్మలమురళి పేర్కొన్నారు. మంగళవారం ఓ నిరుపేద కుటుంబానికి రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. ట్రస్ట్ సభ్యుడు కల్లమడి రవీంద్రనాథ్ సతీమణి రమాదేవి తమ మనవరాలు చిరంజీవి రేయ జన్మదిన సందర్భంగా ఈ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగాఅనంతపురం నగర శివారులో నివసిస్తున్న, శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న 14 ఏళ్ల బాలిక కుటుంబానికి 42 రకాల నిత్యావసర సరుకులతో పాటు బియ్యం ప్యాకెట్‌ను అందించారు.



ఈ సందర్భంగా డాక్టర్ ఎస్. నిర్మలమురళి మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేదలకు అండగా నిలవడం సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ట్రస్ట్ సభ్యుల సహకారంతో నిరుపేదల సంక్షేమం కోసం నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ తమకు చేతనైన మేరకు పేదలకు ఏదో ఒక రూపంలో సాయం చేయాలని పిలుపునిచ్చారు. పేదల కష్టాలను గుర్తించి, మానవత్వంతో ముందుకు వచ్చి సహాయం చేయడం సమాజానికి ఆదర్శమని ఆమె



పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, సేవాభావం కలిగిన దాతలు తదితరులు పాల్గొన్నారు.

## మితిమీరిన యూరియా వినియోగంతో పంటకు నష్టం- వ్యవసాయ అధికారులు




**బండి ఆత్మకూరు, జూన్ 23, (రిపబ్లిక్ న్యూస్):-** రైతులు పంట పొలాల్లో మోతాదుకు మించి యూరియా చల్లడం వల్ల పంటకు నష్టం వాటిల్లుతుందని నంద్యాల జిల్లా వనరుల కేంద్ర ఏడి చెన్నయ్య, మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ లు సూచించారు. మంగళవారం మండలంలోని నారాయణపురం, చిన్నదేవలాపురం గ్రామాల్లో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు రైతులకు పలు కీలక సూచనలు చేశారు. యూరియా అధికంగా వాడటం వల్ల పైరుకు అనేక దుష్ప్రభావాలు కలుగుతాయన్నారు. మొక్కలు బలహీనంగా మారి చీడపీడలు ఆశించి తెగుళ్లబారిన పడతాయన్నారు. పంట ఉత్పత్తులు నిలువ సామర్థ్యం నాణ్యత, దిగుబడి పై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. మట్టిలో ఉండే సూక్ష్మజీవులు చనిపోయి మట్టి చౌడు భూమిగా మారుతుందన్నారు. దీనివల్ల రైతులకు మరింత నష్టం వాటిల్లుతుందన్నారు. యూరియా చల్లినప్పుడు తక్షణమే పంటలో మార్పు కనిపించినట్లే దీర్ఘకాలంలో కూడ నేలను, నీటిని నాశనం చేస్తాయని వ్యవసాయ అధికారులు వివరించారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులపై దృష్టి సారించాలని చెప్పారు. దీంతో పర్యావరణం పరిరక్షణ కూడా సాధ్యమవుతుందని వారు వెల్లడించారు. అనంతరం యూరియా యాప్ ద్వారా రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**: కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి**

**మాధవరం సమీపంలో హెలిప్యాడ్, భద్రతా ఏర్పాట్ల పరిశీలన ట్రాఫిక్, పార్కింగ్, రాకపోకలపై ప్రత్యేక దృష్టి**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 23)**
ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టి, ఎటువంటి లోపాలకు తావులేకుండా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి అధికారులను ఆదేశించారు. మంత్రాలయం మండలం మాధవరం గ్రామం సమీపంలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గురువారం ముఖ్యమంత్రి మంత్రాలయంలో పర్యటించే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు.
ముఖ్యమంత్రి హెలికాప్టర్ ల్యాండింగ్ కోసం నిర్మిస్తున్న హెలిప్యాడ్ పనులను నిబంధనలకు అనుగుణంగా



చేపట్టాలని సూచించారు. అలాగే హెలిప్యాడ్ పరిసర ప్రాంతాల్లో భద్రతా చర్యలను మరింత పటిష్టంగా అమలు చేయాలని అధికారులకు ఆదేశించారు.
ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, రాకపోకల మార్గాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీసు, రవాణా శాఖ అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని స్పష్టం చేశారు.



అనంతరం కలెక్టర్ హెలిప్యాడ్ ప్రాంతం, సభా వేదిక స్థలం, వాహనాల పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.
ఈ కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ (ఇన్‌చార్జి) మధుసూదన్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఈ మహేశ్వర రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షులు గుడిసె కృష్ణమ్మ, మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శ్రీనివాసరాజు, తహసీల్దార్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి జొన్నగిరి పర్యటనకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

**1,200 మంది పోలీసులతో భారీ బందోబస్తు**

**అధికారులకు దిశానిర్దేశం చేసిన కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్**



**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 23)**రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జొన్నగిరి పర్యటన సందర్భంగా చేపట్టిన భద్రతా ఏర్పాట్లను కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఐపీఎస్ సమీక్షించారు. పగిడిరాయి గ్రామ సమీపంలోని జొన్నగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న గోల్డ్ మైన్స్ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో భద్రతా ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి చేపట్టిన అన్ని భద్రతా చర్యలను డీఐజీకి వివరించారు. హెలిప్యాడ్, సభా ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాలు, రూట్ బందోబస్తు, సెక్టార్ల వారీగా నియమించిన ఇన్‌ఛార్జ్ అధికారుల బాధ్యతలు, భద్రతా ప్రణాళికల గురించి సమగ్రంగా వివరించారు.ముఖ్యమంత్రి పర్యటన కోసం మొత్తం 1,200 మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. అనంతరం డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ సెక్టార్ ఇన్‌ఛార్జ్‌లు, పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. బందోబస్తు విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, పరస్పర సమన్వయంతో పనిచేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.





## జిల్లాలో పారదర్శకంగా సాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ

**58.67 శాతం ఎస్ఐఆర్ లో జిల్లా పురోగతి**

**జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్**

**నంద్యాల బ్యూరో, జూన్23 (రిపబ్లిక్ న్యూస్):**
జిల్లాలో ఎస్ఐఆర్ (ఓటర్ల జాబితా సమగ్ర సవరణ) పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్ రాజకీయ పార్టీ ప్రతినిధులకు వివరించారు. మంగళవారం జిల్లా రెవెన్యూ అధికారి ఛాంబర్ లో ఓటర్ల జాబితా రూపకల్పన పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో డిఆర్ఓ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి ప్రదీప్, బీజేపీ పార్టీ ప్రతినిధి చంద్రశేఖర్, సిపిఐ పార్టీ ప్రతినిధి నరసింహులు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి రియాజ్ బాషా, టిడిపి పార్టీ ప్రతినిధి శివరాం రెడ్డి, వైఎస్సార్సీపీ పార్టీ ప్రతినిధి సాయిరామ్ రెడ్డి, జనసేన పార్టీ ప్రతినిధి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ (ఓటర్ల జాబితా సమగ్ర సవరణ)



భాగంగా జిల్లాలో ఉన్న ఎఈఆర్ఓల నుండి బిఎల్ఓ స్థాయి వరకూ పూర్తి స్థాయి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. అందులో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకూ 58.67 శాతం ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయడంతో పాటు ఓటర్ల నుండి ఎన్యూమరేషన్ ఫారాలను సేకరించి డిజిటలైజ్ కూడా చేయడం



జరుగుతోందని రాజకీయ పార్టీ ప్రతినిధులకు డిఆర్ఓ వివరించారు. అదే విధంగా బిఎల్ఓల క్షేత్ర పర్యటనలో భాగంగా మ్యాపింగ్ కానీ ఓటర్లు ఎన్నికల కమీషన్ నిర్దేశించిన ధృవ పత్రాల అందజేతపై బిఎల్ఓల ద్వారా పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు. అనంతరం ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నింపాల్సిన ఎన్యూమరేషన్ ఫారాన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులకు పూర్తి స్థాయిలో వివరించారు. అదే విధంగా రాజకీయ పార్టీ ప్రతినిధులు లేవనెత్తిన అంశాలను రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదిస్తామని రాజకీయ పార్టీ ప్రతినిధులకు డిఆర్ఓ తెలిపారు.

# దేశంలో మారుతున్న రాజకీయ ముఖచిత్రం !

**జూన్, 23( రిపబ్లిక్ న్యూస్)**
దేశంలో రాజకీయాలు అనూహ్య మలుపు తిరుగుతున్నాయి. ప్రధాన పార్టీలన్నీ దంగయిపోతున్నాయి. బెంగాల్ ఫలితాల తరవాత మమతా బెనర్జీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. తాజాగా ఆమెను అధ్యక్ష పదవి నుంచి తొలగిస్తూ మెజార్టీ ఎమ్మెల్యేలు తీర్మానం చేశారు. ఇక మహారాష్ట్రలో బాలథాక్రే స్థాపించిన శివసేన దాదాపు అంతర్ధానం అయ్యే దుస్థితిలో ఉంది. యూపిలో అఖిలేశ్ పార్టీలో సైతం ముసలం పుట్టింది. ఇదంతా యాదృచ్ఛికంగా జరుగుతన్నదని భావించడానికి లేదు. మహిళా బిల్లు, డీ లిమిటేషన్ బిల్లు వీగిపోయిన తరవాత అధికార బిజెపి వేస్తున్న ఎత్తులకు ప్రాంతీయ పార్టీలు చిత్తవుతున్నాయి. ఇదే ఆయా పార్టీల పునాదులను పెకిలిస్తోందని భావించాలి. ఇదంతా కూడా మళ్లీ డీ లిమిటేషన్, మహిళా బిల్లును గట్టెక్కించే పనిలో అధికార పార్టీ చేస్తున్న కసరత్తుగానే గుర్తించాలి. ఈసారి ఈ రెండు బిల్లును ఎలాగైనా గట్టెక్కించే పనిలో మోడీ ద్వయంయ ఉన్నట్లుగా అర్థం అవుతోంది. ప్రభుత్వం పూర్తిస్థాయిలో ముసాయిదాను సిద్ధం చేసినా పార్లమెంట్‌లో తగిన మద్దతు దక్కుతుందన్న నమ్మకం కలిగితేనే ఈ బిల్లును సభ ముందుకు తీసుకురావాలని వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఈ చట్టం ఆమోదం పొందాలంటే లోక్‌సభ.. రాజ్యసభల్లో మూడింట రెండు వంతుల ప్రత్యేక మెజారిటీ సాధించాలి. అంతటితో ఈ పక్రియ పూర్తి కాదు. దేశంలోని కనీసం సగంరాష్ట్రాల శాసనసభలు ఈ బిల్లును ఆమోదించి తీరాల్సి ఉంటుంది. సంఖ్యాబలంపై పూర్తి ధీమా వచ్చాకే ఎన్డీయే సర్కార్ ఈ మహిళా బిల్లును అధికారికంగా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం కనిపిస్తోంది.



గతంలో జరిగిన అవమానానికి బద్లా తీసుకునే పనిగా కూడా భావిస్తున్నారు. ఎందుకంటే మహిళా రిజర్వేషన్ల అమలుపై దేశవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. ఈ బిల్లును అమలులోకి తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం తెరవెనుక పక్కా ప్రణాళిక సిద్ధం చేస్తోందనడానికి ఇంతకన్నా నిదర్శనం అక్కర్లేదు. డీలిమిటేషన్.. సీట్ల పెంపు లాంటి కీలక అంశాలపై ఉన్న అనుమానాలను నివృత్తి చేస్తూ ఓ సరికొత్త ముసాయిదాను ప్రభుత్వం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ వర్షాకాల సమావేశాల్లోనే దీనిని గట్టెక్కించే పనిలో భాగగంఅ బలాన్ని పెంచుకునే ఎత్తులో బిజెపి ఉన్ట్లు స్పష్టం అవుతోంది. గతంలో ప్రతగిపాదించినట్లుగానే లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలను ఏకంగా 50 శాతం పెంచే ఆలోచనలో మోడీ సర్కార్ ఉన్నట్లు తెలుస్తోంది. చట్టసభల్లో మహిళలకు సముచిత స్థానం కల్పించాలన్న డిమాండ్ దశాబ్దాలుగా ఉంది. ఇటీవల ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లును విపక్షాలు వ్యతిరేకించడంతో అది వీగిపోయింది. బెంగాల్, తమిళనాడు ఎన్నికల తర్వాత విపక్షాల బలం తగ్గడంతో మహిళా రిజర్వేషన్ల అమలుపై కేంద్ర ప్రభుత్వం వేగంగా పావులు కదుపుతోంది. మరింత పకడ్బందీగా 133వ రాజ్యాంగ సవరణను తీసుకురావడానికి సన్నాహాలు చేస్తోంది. ముఖ్యంగా సీట్ల పునర్విభజన సమయంలో దక్షిణాది రాష్ట్రాల నుంచి వస్తున్న అభ్యంతరాలకు చెక్ పెట్టేలా ఈ కొత్త ముసాయిదాను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. పార్లమెంట్ స్థానాల పెంపు వల్ల జనాభా నియంత్రణ పాటించిన రాష్ట్రాలకు రాజకీయంగా నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే.. రాష్ట్రాల మధ్య సీట్ల నిష్పత్తిని 1971 జనాభా లెక్కల ఆధారంగానే కొనసాగించాలని కేంద్రం గట్టిగా భావిస్తోంది. అదే సమయంలో ఒక రాష్ట్రం పరిధిలో నియోజకవర్గాల సరిహద్దుల మార్పునకు మాత్రం 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోనున్నట్లు ప్రచారం సాగుతోంది.ప్రభుత్వం సిద్ధం చేసిన ఈ కొత్త ముసాయిదా లో అత్యంత కీలకమైన అంశం చట్టసభల స్థానాల పెంపు. లోక్‌సభతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలను భారీగా పెంచబోతున్నారు. వీలైనంత వరకు అన్ని చోట్లా ఏకంగా 50 శాతం మేర సీట్లను పెంచాలని కేంద్రం భావిస్తోంది.. సాధ్యమైనంత వరకు 50 శాతం పెంపు విధానాన్ని అమలు చేసి.. మహిళలకు తగినన్ని సీట్లు కేటాయించాలని చూస్తున్నారు. ఇందుకోసం రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 55, 81, 82తో పాటు 170, 330లకు మార్పులు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం పార్లమెంట్‌లో పెండింగ్‌లో ఉన్న డీలిమిటేషన్ బిల్లులో కూడా తగిన సవరణలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. భవిష్యత్తులో ఏర్పాటు చేయబోయే నియోజకవర్గాల పునర్విభజన కమిషన్ ఈ కొత్త సూత్రాల ఆధారంగానే తన పనిని కొనసాగించాల్సి ఉంటుంది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటే ముందుగా సభలో మొత్తం సభ్యుల సంఖ్య పెరగాలి. అప్పుడే సిట్టింగ్ ఎంపీలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఈ సీట్ల పెంపు పక్రియతో కేవలం మహిళలకే కాకుండా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కూడా భారీగా రాజకీయ లబ్ది చేకూరనుంది. తాజా ప్రతిపాదనల ప్రకారం చూస్తే.. లోక్‌సభలో ఎస్సీ స్థానాలు ప్రస్తుతమున్న 84 నుంచి ఒకేసారి 136కు పెరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. అలాగే ఎస్టీల స్థానాలు కూడా 47 నుంచి 70కి పెరగనున్నాయి. ఈ మార్పు చేయడం ద్వారా లోక్‌సభలో షెడ్యూల్డ్ కులాలకు దక్కాల్సిన పూర్తి 16 శాతం కోటా వారికి అందుతుంది. పెరిగిన ఈ కొత్త స్థానాల్లో మహిళా రిజర్వేషన్లను వర్టికల్ విధానంలో పక్కాగా అమలు చేస్తారని ప్రచారం. అంటే పెరిగిన ఎస్సీ.. ఎస్టీ స్థానాల్లో కూడా మూడో వంతు సీట్లను ఆయా వర్గాలకు చెందిన మహిళలకే కేటాయిస్తారు. ఈ మొత్తం రాజకీయ పక్రియను 2029 సాధారణ ఎన్నికల నాటికి పూర్తి చేయాలన్నది కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. డీలిమిటేషన్ విషయంలో పలు రాష్ట్రాల నుంచి వ్యక్తమవుతున్న అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని.. అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపేలా ప్రధానమంత్రి కార్యాలయం ఇప్పటికే ఉన్నతస్థాయి సమావేశాలు నిర్వహించి కీలక నిర్ణయాలు తీసుకుంది. అయితే భారత రాజకీయ ముఖచిత్రాన్ని మార్చే ఈ భారీ నిర్ణయం అమలు చేయడం ప్రభుత్వానికి అంత సులభం కాదు. దీనికోసం చట్టసభల్లో స్పష్టమైన సంఖ్యాబలం అత్యవసరం. అందుకే ఇప్పుడు ఆయా పార్టీల్లో పగుళ్లు పడుతు న్నాయి. బెంగాల్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లో దాదాపు ఆయా ప ఆర్టీలకు వణుకు పుట్టించేలా చీలికలు మొదలయ్యాయి. దీంతో లోక్‌సభలో, రాజ్యసభలో సంపూర్ణ మెజార్టీ కోసం యత్నాలు మొదలయ్యాయని భావించాలి. తమిళనాడులో కూడా డిఎంకె పరోక్షంగా మద్దతు ఇస్తుందని భావిస్తున్నారు. కాంగ్రెస్‌పై గుర్రుగా ఉన్న ఆ పార్టీ,ఇండి కూటమితో కలసి వెళ్లకపోవచ్చు. మొత్తంగా రానున్న రోజుల్లో ఈ ముఖచిత్రం మరింత స్పష్టంగా ఆవిష్కృతం కానుంది.

---

## 60 ఏళ్ల ప్రయాణంలో శివసేన అంతర్ధాన దశ

### ఉద్దవ్ స్వయంకృతంతో పార్టీకి ముప్పు -తండ్రి ఆశయాలు కాపాడడంలో పూర్తిగా విఫలం

**ముంబై,జూన్, 23( రిపబ్లిక్ న్యూస్)**
మహారాష్ట్రలో బలంగా నిలిచిన శివసేన కథ ఇంక కంచికేనా అన్న చర్చ సాగుతోంది. బాణంలా దూసుకుని వచ్చిన బాల్ థాక్రే స్థాపించిన 'శివసేన' సరిగ్గా 60 వసంతాలు పూర్తి చేసుకుని వజ్రోత్సవ వేడుకలకు సిద్ధం అవుతున్న వేళ..అంతర్ధానానికి దగ్గరవుతోంది. యాదృచ్ఛికమే అయినా 60 వసంతాల పార్టీ ఇలా కావడం స్వయంకృతమే. 1966 జూన్ 19న ముంబైలోని చారిత్రాత్మక శివాజీ పార్క్‌లో బాల్ థాక్రే కొబ్బరికాయ కొట్టి ఈ పార్టీని ప్రారంభించారు. నాడు కొద్దిమంది మద్దతుదారులు, వేలాది మంది 'మరాఠీ మానుస్' సాక్షిగా పురుడుపోసుకున్న ఈ ప్రాంతీయ మహావృక్షం.. రెక్కలు విరిగాయి. నేలకొరగడానికి సిద్దంగా ఉంది. విచిత్రమేమిటంటే.. బాల్ థాక్రే స్థాపించిన అసలైన 'శివసేన' పేరు, దాని సాంప్రదాయక 'విల్లు-బాణం' గుర్తు ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి ఏకనాథ్ షిండే వశమయ్యాయి. మరోవైపు ఉద్ధవ్ థాక్రే వద్ద తండ్రి పెట్టిన పార్టీ పేరు కానీ, గుర్తు కానీ మిగల్లేదు. వారి పార్టీ ఇప్పుడు 'శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ థాక్రే)'గా రూపాంతరం చెంది, 'మశాల్' (దివిటీ) గుర్తుతో మనుగడ సాగిస్తోంది. ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆ దివిటీ సైతం దాదాపు ఆరిపోయే స్థితికి చేరుకుంది. శివసేనను స్థాపించినప్పుడు బాల్ థాక్రే రెండు ప్రధాన ఆశయాలను నిర్దేశిరచుకున్నారు. ఒకటి 'మరాఠీ అస్తిత్వం', రెండోది 'హిందుత్వ సిద్ధాంతం'. కానీ నేడు ఉద్ధవ్ థాక్రే తన తండ్రి నుంచి వచ్చిన ఈ రెండు రాజకీయ వారసత్వాలను కాపాడుకోవడానికి తీవ్రంగా పోరాడాల్సి వస్తోంది. బాల్ థాక్రే హయాంలో శివసేన సాధించిన శిఖరాగ్రాల నుంచి ఉద్ధవ్ హయాంలో ఎదుర్కొంటున్న జీవన్మరణ పరిస్థితి వరకు అనేక ఆటుపోట్లు ఎదుర్కొంది. 1992 జూలై 18న శివసేనలో జరిగిన ఘటన సంచనలంగా మారింది. బాల్ థాక్రే పార్టీని ఒక సొంత ఆస్తిలా చూస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో కలత చెందిన బాల్ థాక్రే, పార్టీ ముఖపత్రం 'సామ్నా'లో ఒక వ్యాసం రాస్తూ.. తాను



శివసేన నుంచి తప్పుకుంటున్నట్లు సంచలన ప్రకటన చేశారు. ఈ వార్తతో మహారాష్ట్రవ్యాప్తంగా ఉన్న శివసైనికుల్లో తీవ్ర కలకలం రేగింది. ముంబైలోని శివసేన ప్రధాన కార్యాలయం వెలుపల లక్షలాది మంది సైనికులు తరలివచ్చి.. 'బాలాసాహెబ్ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి' అని కన్నీటితో వేడుకున్నారు. శివసైనికులకు తనపై ఉన్న ఆ అచంచలమైన ప్రేమాభిమానాలను చూసి బాల్ థాక్రే తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోక తప్పలేదు. బాల్ థాక్రే బతికున్నంత కాలం మహారాష్ట్ర రాజకీయాలకు కేంద్ర బిందువు వారి నివాసమైన 'మాతోశ్రీ' మాత్రమే. శివసేన అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా.. ముంబై నగర రిమోట్ కంట్రోల్ బాలాసాహెబ్ చేతుల్లోనే ఉండేది. 'మాతోశ్రీ' నుంచి చిన్న సంకేతం వస్తే చాలు.. ముంబై స్థంభించిపోయేది. శాంతిభద్రతల పరిరక్షణ కోసం స్వయంగా ముంబై పోలీసులు సైతం శివసేన ప్రముఖుడిని అభ్యర్థించాల్సిన పరిస్థితి ఉండేది. కోవిడ్ లాక్‌డౌన్ కంటే ముందే.. ముంబై లోకల్ రైళ్లకు బ్రేక్ వేయగల ఏకైక శక్తి బాల్ థాక్రేకే ఉండేదని ఇప్పటికీ ముంబై ప్రజలు చెప్పుకుంటారు. కానీ, నేడు బాల్ థాక్రే శతాబ్ది జయంతి ఉత్సవాల వేళ, ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలోని పార్టీ రెండోసారి ఘోరమైన చీలికను ఎదుర్కొంటోంది. ఆయన కుడిభుజం లాంటి సంజయ్ రౌత్ కేవలం ప్రత్యర్థులపై వీధి రౌడీల తరహాలో విమర్శలు చేయడానికే పరిమితమయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బాల్ థాక్రేకు, ఉద్ధవ్ థాక్రేకు రాజకీయ వ్యూహాల్లోనూ, వ్యక్తిత్వంలోనూ నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉంది. బాల్ థాక్రే తన జీవితంలో ఎన్నడూ అధికార పీఠాన్ని ఆశించలేదు. ఆయన ఎప్పుడూ 'కింగ్' అవ్వాలని అనుకోలేదు, 'కింగ్‌మేకర్' గానే ఉండటానికి ఇష్టపడ్డారు. శివసైనికులు బాలాసాహెబ్ కోసం ప్రాణాలు ఇవ్వడానికైనా సిద్ధపడ్డారంటే.. ఆయన దశాబ్దాల పాటు క్షేత్రస్థాయిలో చేసిన పోరాటమే దానికి కారణం. 2003 నుంచి పార్టీలో ఉద్ధవ్ జోక్యం పెరిగిన తర్వాత, శివసేన ఏకంగా నాలుగు సార్లు పెద్ద తిరుగుబాట్లను చవిచూసింది. ఉద్ధవ్‌పై తిరుగుబాటు చేసిన ప్రతి ఒక్కరి వాదన ఒక్కటే.. ఆయనలో బాల్ థాక్రే లక్షణాలు ఏమాత్రం లేవని, అయినా సరే అందరూ తనను బాలాసాహెబ్‌లాగే గౌరవించాలని ఉద్ధవ్ ఆశిస్తారని అసమ్మతి నేతలు ఆరోపిస్తుంటారు. బీజేపీతో కలిసి ఎన్నికల్లో గెలిచిన తర్వాత, ఉద్ధవ్ థాక్రే అనూహ్యంగా ప్లేట్ ఫిరాయించి కాంగ్రెస్, ఎన్సీపీలతో చేతులు కలిపి స్వయంగా ముఖ్యమంత్రి అయ్యారు. అంతేకాకుండా తన సొంత మంత్రివర్గంలో కొడుకు ఆదిత్య థాక్రేకు మంత్రి పదవి కట్టబెట్టారు. ఉద్ధవ్ నిర్ణయాలపై ఆయన భార్య రష్మి థాక్రే, కుమారుడు ఆదిత్య థాక్రే, సంజయ్ రౌత్‌లతో కూడిన ఒక ప్రత్యేక కోటరీ ప్రభావం ఎక్కువగా ఉంటుందని, ఇది బాలాసాహెబ్ ఇమేజ్ ముందు ఉద్ధవ్‌ను బలహీనంగా మార్చేసిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తారు. బాల్ థాక్రే బతికుండగానే జరిగిన మొదటి తిరుగుబాటు ఇది. భుజబల్ ఆ తర్వాత కాంగ్రెస్, ఎన్సీపీల ద్వారా రాజకీయాల్లో కొనసాగారు. విచిత్ర మేమిటంటే, ఆ తర్వాత కాలంలో అదే భుజబల్‌ను ఉద్ధవ్ తన మంత్రివర్గంలో చేర్చుకోవాల్సి వచ్చింది.
ఇప్పుడు ఏక్‌నాథ్ షిండేతో మొత్తం శివసేన రూపం మారిపోయింది. అసపలు శివసేనకు షిండే నాయకుడయ్యారు. ఇటీవల ఆరుగురు ఎంపీలు కూడా వెళ్లిపోవడంతో ఉద్ధవ్ శివసేన మరింత బలహీనపడింది.

## అమెరికా పౌరసత్వం మరింత ఖరీదు

### ఫైలింగ్ ఫీజులను 75శాతం పెంచే యోచన

**వాషింగ్టన్,జూన్, 23( రిపబ్లిక్ న్యూస్)**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారం చేపట్టినప్పటి నుంచి ఇమిగ్రేషన్ రూల్స్‌ను కఠినతరం చేస్తూనే ఉన్నారు. తాజాగా ఆయన కార్యవర్గం చేసిన ప్రతిపాదనలతో అమెరికా పౌరసత్వం మరింత ఖరీదుగా మారనుంది. పౌరసత్వ దరఖాస్తుల ఫైలింగ్ ఫీజులను 75 శాతం మేర పెంచాలని యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ ప్రతిపాదించింది. సక్రమ మార్గంలో వచ్చిన వలసదారులు పౌరసత్వానికి దరఖాస్తు చేసుకుంటే.. ప్రాసెసింగ్, వెట్టింగ్ ఖర్చులు భరించాల్సిరావడంతో పాటు ఇప్పటివరకు ఉన్న పలు మినహాయింపులను కూడా కోల్పోనున్నారు.

-------------

## టూరిస్ట్ బస్సులపై పన్నులు తగ్గింపు

### కేబినేట్ నిర్ణయంపై మంత్రి మండిపల్లి హర్షం

**అమరావతి,జూన్, 23( రిపబ్లిక్ న్యూస్)** రాష్ట్రంలో పర్యాటక, రవాణా రంగాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో టూరిస్ట్ బస్సుల నిర్వహణ భారాన్ని తగ్గించేలా.. పన్నుల తగ్గింపునకు రాష్ట్ర క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రత్యేక చొరవ, వాహన యజమానుల సుదీర్ఘ విజ్ఞప్తుల నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. దీని ప్రకారం.. 'అఖిల భారత పర్యాటక పర్మిట్' కలిగిన టూరిస్ట్ బస్సులకు ప్రతి సీటుపై విధించే త్రైమాసిక పన్నును రికార్డు స్థాయిలో తగ్గించారు. ఇప్పటివరకు ఉన్న రూ. 4,000 పన్నును రూ. 2,500కు తగ్గిస్తూ మంత్రి మండలి ఆమోదం తెలిపింది. గతంలో భారీగా ఉన్న పన్నుల భారం కారణంగా ఏపీకి చెందిన పలువురు బస్సు ఆపరేటర్లు తమ వాహనాలను పొరుగు రాష్ట్రాలలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. తాజా పన్ను తగ్గింపుతో ఆయా రాష్ట్రాలకు వెళ్లిన బస్సుల రిజిస్ట్రేషన్లు తిరిగి ఏపీకి వచ్చేందుకు మార్గం సుగమమైంది. తద్వారా రాష్ట్ర రవాణా రంగానికి కొత్త ఊపు రావడమే కాకుండా, పర్యాటక రంగానికి మరింత ప్రోత్సాహం లభించనుంది. వాహన యజమానులపై పన్ను భారం గణనీయంగా తగ్గినప్పటికీ.. రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరగడం ద్వారా రాష్ట్ర ఖజానాకు ఆదాయం పెరగుతుంది. అలానే రవాణా శాఖకు వాహనాలపై మెరుగైన పర్యవేక్షణకు అవకాశం లభిస్తుంది. క్యాబినెట్ తీసుకున్న ఈ నిర్ణయం పట్ల రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రవాణా రంగ సంక్షేమానికి, ఆపరేటర్ల ప్రయోజనాలకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందనేందుకు ఈ నిర్ణయమే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. కేవలం పన్నుల తగ్గింపు మాత్రమే కాకుండా, టూరిస్ట్ బస్సుల భద్రత, ఫిట్‌నెస్ పర్యవేక్షణను మరింత కఠినతరం చేస్తూ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడతామని మంత్రి రాంప్రసాద్ స్పష్టం చేశారు.

## రేవంత్ కోరారు..కేంద్రమంత్రులను కలిసాం

### ఎక్స్ వేదికగా కిషన్ రెడ్డి వెల్లడి



**న్యూఢిల్లీ,జూన్, 23( రిపబ్లిక్ న్యూస్)**
ఢిల్లీ పర్యటనలో భాగంగా పలువురు కేంద్ర మంత్రులతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి సోమవారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో, మంగళశారం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్‌తో రేవంత్ సమావేశమయ్యారు. ప్రధానంగా హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 విస్తరణపైనే చర్చ జరిగింది. రేవంత్‌తో కలిసి కేంద్ర మంత్రులను కలవడంపై కిషన్ రెడ్డి సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు.'కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండుసార్లు నాకు లేఖ రాశారు. 22వ తేదీన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో, 23వ తేదీన కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్‌తో సమావేశం ఏర్పాటు చేయించాను. మెట్రో రైల్ విస్తరణపై సానుకూల వాతావరణంలో చర్చలు జరిగాయి. తెలంగాణ నుంచి కేంద్ర కేబినెట్ మంత్రిగా ఉన్న నేను రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం ఎల్లవేళలా పనిచేస్తా' అని ఎక్స్‌లో కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

## హర్మూజ్‌పై పట్టుకోసం ఇరాన్ బెట్టు

### అమెరికన్లను ఎప్పుడూ నమ్మబోమన్న ఇరాన్

**టెహ్రాన్,జూన్, 23( రిపబ్లిక్ న్యూస్)**
పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గించేందుకు ప్రయత్నాలు జరుగుతోన్న తరుణంలోనూ.. హర్మూజ్ జలసంధిపై అమెరికా, ఇరాన్ తరచూ ఏదో ఒక ప్రకటన చేస్తూనే ఉన్నాయి. హర్మూజ్ నిర్వహణను ఇరానే చూస్తుందని ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ ఘాలిబఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ జలసంధి.. యుద్ధానికి ముందున్న స్థితికి ఎప్పటికీ తిరిగిరాదన్నారు. మేం అమెరికన్లను ఎన్నడూ నమ్మలేదు. ఇప్పుడూ నమ్మడం లేదు. భవిష్యత్తులోనూ వారిపట్ల ఆ ధోరణితో ఉండటం సమంజసమే అని ఘాలిబఫ్ అమెరికా పట్ల ఇరాన్‌కున్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. స్విట్జర్లాండ్‌లో ఇప్పటికే రెండు దేశాల



మధ్య చర్చలు జరిగిన సంగతి తెలిసిందే. ఫ్రీజ్ చేసిన 12 బిలియన్ డాలర్ల ఇరాన్ ఆస్తులను విడుదల చేయడానికి తుది ఒప్పందం కుదిరిందని ఆయన పేర్కొన్నారు. కాగా.. తమ నుంచి సోయా, మొక్కజొన్న, గోధుమలు కొనేందుకు ఇరాన్ అంగీకరిస్తే.. ఫ్రీజ్ చేసిన ఆ దేశ ఆస్తులను విడుదల చేసేందుకు అమెరికా సిద్ధంగా ఉన్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హర్మూజ్‌పై భిన్నమైన వ్యాఖ్యలు చేశారు. హర్మూజ్ పూర్తిగా తెరిచే ఉందని ప్రకటించారు. ఈ జలసంధికి మరోవైపున ఉన్న ఒమన్ దేశం తాజా పరిణామాలపై స్పందించింది. అంతర్జాతీయ చట్టాలకు, టోల్ రహిత ప్రయాణానికి కట్టుబడి ఉన్నామని ప్రకటించింది. ఇరాన్-అమెరికా మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంపై నిర్మాణాత్మక చర్చలు జరిగాయని పేర్కొంది.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ

- తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 23( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**




స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్ ) పై సంగుపేట చౌరస్తాలోని లక్ష్మీదేవి గార్డెన్ లో నిర్వహించిన అందోల్ నియోజక వర్గ బూత్ లెవెల్ ఏజెంట్స్ (బి ఎల్ ఏ ) లతో అవగాహన, శిక్షణ శిబిరం లో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్, ఏ ఐ సి సీ సెక్రటరీ సచిన్ సావంత్, రాష్ట్ర పి సీ సీ అధ్యక్షులు శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ లు పాల్గొన్నారు.ఈ సమావేశం లో ఎస్ ఐ ఆర్ పై మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ గారు బి ఎల్ ఏ లకు పలు సూచనలు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటర్ గా నమోదు చేయాలన్నారు. ఓటర్ల జాబితా లో తప్పుల సవరణ కు కృషి చేయాలన్నారు. ఓటర్ తన ఓటు హక్కు ను కలిగి ఉండేలా చైతన్యాన్ని పెంపొందించాలన్నారు. ఎస్ ఐ ఆర్ పై ప్రజా ప్రతినిధులు, ప్రతి ఒక్క బూత్ లెవెల్ ఏజెంట్స్ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎస్ ఐ ఆర్ యొక్క ముఖ్య ఉద్దేశం పై అవగాహన కల్పించారు.ఈ సమావేశం లో ఎంపీ సురేష్ షెట్కర్, ఎమ్మెల్యే డా. సంజీవ రెడ్డి. డి సి సి ప్రిసిడెంట్. టీ జి ఐ ఐ సీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, కాటా శ్రీనివాస్ గౌడ్ . ముఖ్య నాయకులు పాల్గొన్నారు

## కన్యకా పరమేశ్వరి దేవాలయం నిర్మాణానికి సంపూర్ణ సహకారం





**సంగారెడ్డి నియోజక వర్గం ప్రతినిది జూన్ 23( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
పటాన్ చెరు పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీశ్రీశ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయం నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం ఆలయంలో ఏర్పాటు చేసిన గడప ప్రతిష్టాపన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ పనులను స్వయంగా పరిశీలించారు. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, పృథ్వీరాజ్, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు రామ్మోహన్, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

### మెగా ఫ్యామిలీపై అభిమానంతో ఆస్తులన్నీ కోల్పోయిన రాముడు..

## సహాయం కోసం ఎదురు చూపులు

**మెగాస్టార్ చిరంజీవి అభిమానులు రాముడుకు ఆర్థిక సాయం చేయాలి**

**కర్నూలు ప్రతినిధి, జూన్ 24(రిపబ్లిక్ న్యూస్)**



కర్నూలు జిల్లా బనగానపల్లెకు చెందిన రాముడు ఒకప్పుడు ప్రముఖ మేస్త్రీగా వంద మందికి పైగా కార్మికులతో పనిచేసేవాడు. మెగా స్టార్ చిరంజీవి, నాగబాబు, పవన్ కళ్యాణ్‌లపై ఉన్న అభిమానంతో వారి సినిమాల కోసం టికెట్లు కొనిపించడం, పుట్టినరోజులు, వివాహ వేడుకల సందర్భంగా అన్నదానాలు నిర్వహించడం, ఆస్పత్రుల్లో పండ్లు, పాలు పంపిణీ చేయడం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టాడు. అయితే అదే అభిమానంతో తన ఆస్తులన్నింటినీ ఖర్చు చేసి ప్రస్తుతం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో పడ్డాడు. కర్నూలు రైల్వే స్టేషన్‌లో నిరాశ్రయ స్థితిలో ఉన్న అతడిని గుర్తించిన స్థానికులు ప్రస్తుతం డోన్‌లోని కారుణ్య ఆశ్రమంలో ఆశ్రయం కల్పించారు. రాముడి పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని మెగా ఫ్యామిలీ సభ్యులు, అభిమానులు స్పందించి అతనికి ఆర్థిక సహాయం అందించాలని కోరుతున్నారు

## మానవత్వాన్ని చాటుకున్నా నేరేడు గుంట సర్పంచ్ సాయి కిరణ్

**అందోల్ నియోజకవర్గం ప్రతినిది జూన్ 23 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**



నేరడిగుంట మక్తగూడెం గ్రామాలకు చెందిన ప్రముఖ వ్యక్తి శ్రీ నాజర్ లింగమయ్య గారు అనారోగ్యంతో మృతిచెందిన వార్త తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాను. ఆయన నాకు అత్యంత ఆప్తులు. ఎప్పుడైనా కలిసినప్పుడు ప్రేమతో "అల్లుడు" అని పలకరించే ఆప్యాయ వ్యక్తి. ఆయన మరణం వ్యక్తిగతంగా నాకు ఎంతో బాధ కలిగించింది.ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, నా ప్రగాఢ సానుభూతిని తెలియజేశాను. అలాగే కుటుంబానికి అండగా నిలుస్తూ రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరిగింది.దివంగత నాజర్ లింగమయ్య గారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను.

# అల్మాయిపేట గ్రామంలో సర్పంచ్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు

**అందోల్ ప్రతినిధి జూన్ 23 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
అందోల్ నియోజకవర్గం కేంద్రమైన ఆందోల్ మండలం అల్మాయిపేట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు రాయిని అనిల్ కుమార్ గ్రామ సర్పంచ్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు నిర్మించుకున్న ఇండ్ల గృహ ప్రవేశం కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి స్థానిక సర్పంచ్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలుపుతూ సొంత ఇంటి కలను సాకారం చేసిన తెలంగాణ ప్రభుత్వానికి మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కి కృతజ్ఞతలు తెలుపుతున్నారని ఆయన పేర్కొన్నారు పేద మరియు నిరుపేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనం అందించాలని లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం



ఎంతోమందికి ఆశా కిరణంగా నిలుస్తుంది అన్నారు ప్రతి ఒక్క లబ్ధిదారుడు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రామాల అభివృద్ధి ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని దీనికి ప్రతి ఒక్క కార్యకర్త ముందుండి అంకితభావంతో పనిచేయాలని ఆయన అన్న ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అమృత నరసింహులు కాంగ్రెస్ పార్టీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెద్ద గొల్ల అశోక్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి దశరథ్ మల్లేశం తదితర నాయకులు పాల్గొన్నారు



# రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే కాంట్రాక్టరు బాలయ్య మృతి

**బీఎస్పీ జోన్ ఛీఫ్ ఇంచార్జ్ అడ్వకేట్ నిషాని రామచంద్రం**

**కరీంనగర్ ప్రతినిధి జూన్ 23( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే కాంట్రాక్టరు బాలయ్య మృతి చెందాడని బీఎస్పీ జోన్ ఛీఫ్ ఇంచార్జ్ అడ్వకేట్ నిషాని రామచంద్రం ఆరోపించారు. ఈ రోజు చీలాపూర్ గ్రామం లో బాలయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ఆయన చిత్ర పటానికి పూల తో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఆయనతో తన తండ్రి మృతి కి ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయలేకపోవడం వలన తీవ్ర మనస్థాపానికి గురై అస్థస్త కు గురి కాగా సకాలం లో 108 రాకపోవడంతో సకాలం లో వైద్యం అందక మృతి చెందారు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అడ్వకేట్ నిషాని రామచంద్రం మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం కాంట్రాక్టర్లు చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయడం లో



పక్షపాతం చూపడం సరైనది కాదన్నారు. బాలయ్య పూర్తి చేసిన ప్రభుత్వ పనులకు బిల్లులు సుమారు రెండు నుండి మూడు కోట్లు ఉన్నాయని అన్నారు. అవి రాకపోవడంతో ఇటీవల తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడని అంతలోనే గుండె నొప్పి వచ్చిందని చికిత్స కు తరలించేందుకు 108 కి ఫోన్ చేస్తే సకాలం లో రాకపోవడంతో ప్రథమ చికిత్స అందక మరణించారని రామచంద్రం అన్నారు . స్థానిక ఎమ్మెల్యే కి ఇసుక దందా మీద ఉన్న శ్రద్ధ నియోజకవర్గ ప్రజల ఆరోగ్యంపై లేకపోవడం సిగ్గుచేటు అన్నారు. కాంగ్రెస్ పిరభుత్వం లో 108 వైద్య సేవలు ప్రజల కు అందుబాటులో లేవని చెప్పడానికి బాలయ్య మరణమే నిదర్శనం అని అన్నారు. ఇకనైనా స్థానిక ఎమ్మెల్యే నియోజకవర్గంలో 108 సేవల పై దృష్టి పెట్టాలని సూచించారు.కనీసం మండలానికి రెండు అంబులెన్సులు ఇరవై నాలుగు గంటలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. అంతకుముందు గుండారం లో గుండె పోటు తో మరణించిన కొంపెల్లి మారుతి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాతంగి అశోక్ అసెంబ్లీ ఇన్చార్జి కోంపెల్లి పర్శరాములు మాజీ ఇంచార్జ్ నిశాని రాజమల్లు రాజు నిషాని బూపతి పాల్గొన్నారు.

# క్రాంతి కుమార్ కుటుంబానికి న్యాయం చేయాలి

**బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి - విద్యార్థి సంఘాల, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్**

**అనంతపురం ప్రతినిధి, జూన్ 23,(రిపబ్లిక్ న్యూస్):**
పేరు పోగు క్రాంతి కుమార్ ఆత్మహత్య ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని ఆ కుటుంబానికి న్యాయం చేయాలని రౌండ్ టేబుల్ సమావేశంలో సామాజిక, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని ప్రెస్ క్లబ్ నందు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు తీర్మానించారు.

**ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని విజ్ఞప్తి**

ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఐ నాగరాజుపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరింది. అలాగే బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణ ఆర్థిక సాయం అందించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని విజ్ఞప్తి చేసింది. స్థానిక ఎన్ జీ ఓ హోం లో మంగళవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు సామాజిక, ప్రజాసంఘాల



నాయకులు పాల్గొని క్రాంతి కుమార్ కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సంఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు నిర్వహించి నిజానిజాలను వెలికి తీసి బాధ్యులను శిక్షించాలని తీర్మానించారు.

**బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలవాలి**

ప్రజలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం స్పందించాలని, బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలవాలని ఆయన కోరారు. బాధ్యులపై ఎలాంటి ఒత్తిళ్లకు తావులేకుండా పారదర్శక విచారణ జరిపి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని



నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. క్రాంతి కుమార్ కుటుంబానికి న్యాయం చేయాలి. బాధ్యులను కఠినంగా శిక్షించాలంటూ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఈ కార్యక్రమంలో ఎం ఎస్ ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంత్రి సుదర్శన్,ఎస్సీ ఎస్టీ జేఏసీ సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి, జై భీమ్ రావు భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టు రామాంజనేయులు, సభాధ్యక్షుడు రాచపల్లి రామాంజి ఎంఆర్పిఎస్, కుంటిమద్ది ఓబులేష్, వివిధ దళిత సంఘాల, ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అవుకు పోలీసుల సక్సెస్ -వరుస ఇంటి దొంగతనాల కేసులు ఛేదన

**ముగ్గురు అరెస్ట్ -రూ.26 లక్షల విలువైన బంగారం స్వాధీనం**

**అవుకు జూన్ 23 రిపబ్లిక్ న్యూస్**
అవుకు పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల అన్నవరం, సింగపల్లె, లింగంబొడు గ్రామాలలో జరిగిన వరుస ఇంటి దొంగతనాల కేసులను అవుకు పోలీసులు సమర్థవంతంగా ఛేదించారు. ఈ కేసులకు సంబంధించి ముగ్గురు నిందితులను ఈ రోజు (23.06.2026) అరెస్టు చేసి, వారి వద్ద నుండి దొంగిలించిన బంగారు ఆభరణాలు మరియు నేరానికి ఉపయోగించిన మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.
వివరాల్లోకి వెళితే, అవుకు మండలం సంగపట్నం గ్రామానికి చెందిన తోక మోషా, మిద్దె ఉసేన్ వలి, తెలుగు వెంకటేశులు అనే ముగ్గురు వ్యక్తులు చెడు వ్యసనాలకు లోనై, సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో అవుకు మండలంలోని వివిధ గ్రామాల్లో పగటిపూట తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. ఇంటి యజమానులు బయటకు వెళ్లిన సమయంలో ఇంటి బయట లేదా గూట్లలో ఉంచిన తాళం చెవులను ఉపయోగించి ఇళ్లలోకి ప్రవేశించి, బీరువాల్లో ఉన్న బంగారు ఆభరణాలను దొంగిలించి, ఎవరికీ అనుమానం రాకుండా తిరిగి తాళం వేసి వెళ్లేవారని దర్యాప్తులో తేలింది.
కేసుల దర్యాప్తులో భాగంగా అవుకు ఎస్.ఐ. శ్రీ +. అశోక్ గారు మరియు పోలీసు సిబ్బంది వెహికల్ చెకింగ్ నిర్వహిస్తుండగా, 23.06.2026 తేదీన అవుకు గ్రామం వెలుపల సాయిబాబా ఆలయం సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు.
విచారణలో వారు పై పేర్కొన్న గ్రామాల్లో జరిగిన ఇంటి



దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుండి వివిధ కేసులకు సంబంధించిన బంగారు గొలుసులు, హారాలు, నెక్లెస్‌లు, కమ్మలు తదితర ఆభరణాలు మొత్తం 195 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ. 26,00,000/- గా అంచనా వేయబడింది. అదేవిధంగా నేరాలకు ఉపయోగించిన బజాజ్ పల్సర్ మోటార్ సైకిల్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు.
తరువాత ముగ్గురు నిందితులను అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు.

### ప్రజలకు పోలీసుల విజ్ఞప్తి

గ్రామీణ ప్రాంత ప్రజలు ఇంటిని తాళం వేసి బయటకు వెళ్లే సమయంలో తాళం చెవులను ఇంటి గూట్లు, కిటికీలు, బాత్రూమ్‌లు లేదా సులభంగా కనిపించే ప్రదేశాల్లో ఉంచకూడదని పోలీసులు విజ్ఞప్తి చేశారు. అలా ఉంచడం ద్వారా దొంగలకు అవకాశం కల్పించినట్లవుతుందని తెలిపారు.



విలువైన బంగారు ఆభరణాలు, నగదు వంటి వస్తువులను సురక్షితంగా లాకర్లలో భద్రపరచుకోవాలని, ఎక్కువ రోజులు ఇంటికి దూరంగా వెళ్లే సందర్భంలో సమీప బంధువులు, పొరుగువారు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.
అనుమానాస్పద వ్యక్తులు గ్రామాల్లో లేదా కాలనీలలో సంచరిస్తున్నట్లు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-112కు సమాచారం అందించాలని కోరారు. ప్రజల సహకారంతోనే నేరాలను సమర్థవంతంగా నియంత్రించవచ్చని పోలీసులు పేర్కొన్నారు.
ఈ సందర్భంగా నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షెరాన్ ఖూూ గారు, డోన్ ఃఖూ శ్రీ౹ా. శ్రీనివాసులు గారు, కేసు దర్యాప్తులో త్వరితగతిన నిందితులను అరెస్టు చేసినందుకు బనగానపల్లి సర్కిల్ జ× శ్రీ వీ. మంజునాథ రెడ్డి గారు, అవుకు ూ× శ్రీ +. అశోక్ గారు మరియు సిబ్బంది గోపాల్, రాజశేఖర్, చంద్ర, మౌలాలి, రఫీ, మహేష్ తదితరులను అభినందించారు.

# జలధార - జలహారతి పనులు నాణ్యతతో పూర్తి చేయాలి

**పొలాల మధ్య“4 కి.మీ ఆటో ప్రయాణం చేసి పనుల తనిఖీ“**

**తంగడంచ చెరువులో ఫీడర్ ఛానల్ పనులను క్షుణ్ణంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**



**నంద్యాల బ్యూరో, జూన్ 23 (రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలో జలధార-జలహారతి కార్యక్రమం కింద చేపడుతున్న నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ, సాగునీటి వనరుల అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జూపాడుబంగ్లా మండలంలోని తంగడంచ గ్రామంలో జలధార - జలహారతి పథకం కింద చేపట్టిన ఫీడర్ ఛానల్ పునరుద్ధరణ పనులు, చెరువుకు నీరు చేరే సరఫరా కాలువలు (సప్లై ఛానల్స్) మరియు మైనర్ ఇరిగేషన్ ట్యాంకు అభివృద్ధి పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనులు జరుగుతున్న ప్రాంతానికి వాహన మార్గం అందుబాటులో లేకపోవడంతో అధికారులు, సిబ్బందితో కలిసి ఆటోలో ప్రయాణించి, పొలాల మధ్యలో ఉన్న రహదారి ద్వారా దాదాపు 4 కిలోమీటర్ల మేర లోపలికి వెళ్లి పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెరువుకు నీటిని అందిస్తున్న రెండు ఫీడర్ ఛానళ్ల అనుసంధానం, వాటి ద్వారా నీటి ప్రవాహం జరుగుతున్న తీరు, సాగునీటి అవసరాలకు అవి అందిస్తున్న ఉపయోగంపై అధికారులతో చర్చించారు. ఫీడర్ ఛానల్ నిర్మాణ నాణ్యత, భౌగోళిక పరిస్థితులు, నీటి ప్రవాహానికి అనుకూలంగా చేపడుతున్న చర్యలు, పనుల పురోగతిపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకం కింద రెండు ఫీడర్ ఛానల్స్ అభివృద్ధి పనులకు రూ.6.73 లక్షల అంచనా వ్యయంతో పనులు చేపట్టినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. తనిఖీ సందర్భంగా చెరువు పరిధిలో కొంత భాగం ఆక్రమణలకు గురైనట్లు గుర్తించిన కలెక్టర్, వాటిని తొలగిస్తే చెరువు నీటి నిల్వ సామర్థ్యం దాదాపు 20 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీంతో అదనంగా సుమారు 0.05 ఎంసీఎఫ్‌టీ నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. చెరువుల అసలు విస్తీర్ణాన్ని పరిరక్షించడం ద్వారా భూగర్భ జలాల పెరుగుదలతో పాటు రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయని అన్నారు. జలధార - జలహారతి కార్యక్రమం గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల పరిరక్షణ, భూగర్భ జలాల పెంపు, వ్యవసాయాభివృద్ధికి కీలకంగా నిలుస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులను నిర్ణీత గడువులో పూర్తి



చేయడంతో పాటు ప్రతి దశలో సాంకేతిక ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరే విధంగా పనులు అమలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో ట్యాంకుల పునరుద్ధరణతో పాటు జిమ్, వాకింగ్ ట్రాక్‌ల అభివృద్ధి పనుల కోసం రూ.60 లక్షలు మంజూరైన విషయాన్ని ప్రస్తావిస్తూ, అభివృద్ధి పనులను సమర్థవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం డ్వామా సిబ్బంది, మైనర్ ఇరిగేషన్ మరియు ఇతర శాఖల అధికారులతో కలిసి మొత్తం పనులను సమగ్రంగా పరిశీలించిన కలెక్టర్, పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేస్తూ మరింత వేగవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీలో డ్వామా పీడీ సూర్యనారాయణ, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల ఆవరణలో పచ్చదనాన్ని పెంపొందించేలా

# అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్ చేపట్టాలి

**పర్యావరణ పరిరక్షణతో పాటు విద్యార్థుల్లో ప్రకృతి పట్ల అవగాహన పెంపొందించాలి**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల బ్యూరో, జూన్ 23( రిపబ్లిక్ న్యూస్):** ప్రారంభించిన జిల్లాలో చేపడుతున్న హరితాభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసి, విద్యాసంస్థల ఆవరణలను పచ్చదనంతో నింపాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం జూపాడుబంగ్లా మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) మరియు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా విద్యాసంస్థల ప్రాంగణాల్లో చేపట్టిన అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని పరిశీలించి, మొక్కల పెంపకం, సంరక్షణ, నీటి వసతి, వాటి పెరుగుదల స్థితి తదితర అంశాలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల విద్యాసంస్థలో అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్ కింద జరుగుతున్న ఉద్యానవన అభివృద్ధి పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నాటిన మొక్కల నిర్వహణ, ప్రాంగణ సుందరీకరణ, పచ్చదనం విస్తరణకు చేపడుతున్న చర్యలను పరిశీలించి, పనులను నాణ్యతతో పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల ఆవరణల్లో విస్తృతంగా మొక్కలు నాటడం ద్వారా విద్యార్థులకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణం అందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందించవచ్చని కలెక్టర్ తెలిపారు. అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్ విధానంలో తక్కువ విస్తీర్ణంలో అధిక సంఖ్యలో మొక్కలను పెంచే అవకాశం ఉండటంతో పచ్చదనం వేగంగా విస్తరిస్తుందని పేర్కొన్నారు. నాటిన ప్రతి మొక్క జీవించి ఎదిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, మొక్కల సంరక్షణ బాధ్యతను పాఠశాల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు భాగస్వామ్యంగా తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు విద్యతో పాటు పర్యావరణ పరిరక్షణలోనూ భాగస్వాములు కావాలని, ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను దత్తత తీసుకుని దాని సంరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పాఠశాలల్లో పర్యావరణహిత కార్యక్రమాలను నిరంతరం నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో ప్రకృతి పరిరక్షణపై బాధ్యతాయుతమైన దృక్పథం పెంపొందుతుందని కలెక్టర్ తెలిపారు. అనంతరం గురుకుల విద్యాసంస్థలోని డైనింగ్ హాల్‌ను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలు, తాగునీటి సౌకర్యాలు, ఇతర మౌలిక వసతులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సంక్షేమానికి సంబంధించిన అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ మరియు సిబ్బందికి సూచించారు.





## వక్ఫ్ ఆస్తులను రక్షించడంలో

# మంత్రి ఫరూక్ విఫలమయ్యారు

**: వైసీపీ మైనారిటీ నేతల ధ్వజం**

**వక్ఫ్ బోర్డు స్థలాలను ప్రభుత్వ సంస్థలకు కేటాయించడం దారుణం: వైసీపీ.**

**ఈద్గాకు చెందిన 10 సెంట్ల స్థలాన్ని కోర్టు కాంప్లెక్స్‌కు ఎలా ఇస్తారు?: ఎమ్మెల్సీ ఇస్సాక్ బాషా.**

**వక్ఫ్ ఆస్తులను రక్షించడంలో మంత్రి ఫరూక్ విఫలమయ్యారు: వైసీపీ మైనారిటీ నేతల ధ్వజం.**

**చాబోలు వద్ద 19 ఎకరాల వక్ఫ్ స్థలాన్ని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు ఇవ్వడాన్ని తప్పుపట్టిన వైసీపీ.**

**వక్ఫ్ ఆస్తుల రక్షణ కోసం ముస్లింలంతా ఏకం కావాలని పిలుపు**



**నంద్యాల బ్యూరో జూన్ 23 (రిపబ్లిక్ న్యూస్):** నంద్యాల జిల్లాలో వక్ఫ్ బోర్డు స్థలాలను ప్రభుత్వ సంస్థలకు కేటాయింపు వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది. ముస్లిం మైనారిటీల పవిత్ర వక్ఫ్ ఆస్తులను ప్రభుత్వ సంస్థలకు కేటాయించడంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కూటమి ప్రభుత్వ చర్యలను దారుణంగా అభివర్ణించింది. అల్లా పేరిట ఉన్న స్థలాలను కోర్టు కాంప్లెక్స్, పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు ఎలా కేటాయిస్తారంటూ వైసీపీ మైనారిటీ నేతలు నిప్పులు చెరిగారు. నంద్యాల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వక్ఫ్ బోర్డు స్థలాలను ఇతర ప్రభుత్వ సంస్థలకు బదలాయించడంపై వైసీపీ మైనారిటీ విభాగం తిరుగుబాటు జెండా ఎగరేసింది. నంద్యాల స్థానిక వైసీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఇస్సాక్ బాషా అధ్యక్షతన ముస్లిం మైనార్టీ నేతల మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ మా బున్నీసా, వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు దాల్మిల్ అమీర్, మేధావుల విభాగం అధ్యక్షుడు రసూల్ ఆజాద్, మైనార్టీ నాయకులు జి మాజీ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు సలముల్లా, గన్నీ కరీం,.ఎం గౌస్, నంద్యాల జిల్లా వైసీపీ జనరల్ సెక్రెటరీ దేవనగర్ బాషా తదితరులు అత్యవసర సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇషాక్ బాషా వైసీపీ నేతలు మాట్లాడుతూ... కౌలూరు గ్రామం ఈద్గా కు చెందిన వక్ఫ్ బోర్డు ఆధీనంలో ఉన్న పది సెంట్ల స్థలాన్ని కోర్టు కాంప్లెక్స్ ల నిర్మాణానికి కేటాయించడాన్ని వైసీపీ నేతలు తీవ్రంగా ఖండించారు. మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న ఎన్.ఎమ్.డి. ఫరూక్.. వక్ఫ్ ఆస్తులను రక్షించాల్సింది పోయి, ఇలా కోర్టుల నిర్మాణానికి రాసివ్వడం ముస్లిం సమాజానికి ద్రోహం చేయడమేనని మండిపడ్డారు.“ఒక్కసారి అల్లాకు ఇచ్చిన స్థలాలను కేవలం ముస్లింల ప్రయోజనాల కోసం, దైవకార్యాల కోసమే ఉపయోగించాలి. వాటిని అమ్మడం, బదలాయించడం నిషిద్ధం. వక్ఫ్ ఆస్తులను కాపాడలేని మంత్రి ఫరూక్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలి. గత వైసీపీ ప్రభుత్వంలో మేము నూనెపల్లి జామియా మసీదు ఆస్తులను కాపాడాం. కానీ ఈ కూటమి ప్రభుత్వం చాబోలు గ్రామం వద్ద ఉన్న వక్ఫ్ బోర్డుకు చెందిన 19 ఎకరాల 14 సెంట్ల భూమిని పోలీస్ హెడ్ క్వార్టర్స్ కు, ఆర్మ్డ్ ఫోర్సెస్ కు కేటాయించడం దారుణమని వైసీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణ కోసం నంద్యాల జిల్లాలోని ముస్లిం మైనార్టీలంతా సంఘటితం కావాలని, ఈ అన్యాయంపై ఎంతవరకైనా వెళ్లి పోరాడతామని వైసీపీ నేతలు హెచ్చరించారు. చట్టపరంగా, సామాజికంగా కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడతామని వారు స్పష్టం చేశారు.

## ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు

# బ్యాంకర్లు ప్రోత్సాహం అందించాలి

**పరిశ్రమల స్థాపనకు అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలి**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల బ్యూరో, జూన్ 23( రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి మరింత ఊతమిచ్చే దిశగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లతో సహా చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు బ్యాంకులు సానుకూలంగా వ్యవహరించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవసరమైన ఆర్థిక సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పరిశ్రమలు మరియు ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలో పరిశ్రమల స్థాపన, సింగిల్ డెస్క్ విధానం అమలు, వివిధ రాయితీల మంజూరు, పరిశ్రమలకు సంబంధించిన సమస్యలు, కొత్త పారిశ్రామిక అవకాశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పరిశ్రమల స్థాపన లక్ష్యాల సాధనలో ఉన్న లోపాలను గుర్తించేందుకు సమగ్రంగా పరిశీలన (గ్యాప్ అనాలిసిస్) చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. గతంలో నిర్దేశించిన లక్ష్యాలు పూర్తిగా ఎందుకు సాధ్యం కాలేదో పరిశీలించి, ప్రజల్లో అవగాహన లేకపోవడమా లేదా బ్యాంకులు, ఆర్థిక సంస్థల సహకారం తక్కువగా ఉండటమా అనే కారణాలను గుర్తించి, వాటి పరిష్కారానికి తగిన కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రస్తుతం ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పలు ప్రాజెక్టులు సిద్ధంగా ఉన్నప్పటికీ, రుణాల మంజూరులో జాప్యం, సిబిల్ స్కోర్ వంటి అంశాలు అవరోధాలుగా మారుతున్నాయని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. లోన్ మంజూరు ప్రక్రియను వేగవంతం చేసి, సాధ్యమైనంత వరకు అర్హులైన పారిశ్రామికవేత్తలకు బ్యాంకులు ప్రోత్సాహకరంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. సింగిల్ డెస్క్ విధానం క్రింద జిల్లాలో వివిధ పరిశ్రమల స్థాపనకు అనుమతుల కోసం మొత్తం 27 దరఖాస్తులు అందగా, వాటిలో 20 దరఖాస్తులకు సంబంధిత శాఖల ద్వారా అనుమతులు మంజూరైనట్లు కలెక్టర్ తెలిపారు. మిగిలిన ఏడు దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని, వాటిపై నిర్ణీత గడువులోగా చర్యలు పూర్తి చేసి పారిశ్రామికవేత్తలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరిశ్రమల ప్రోత్సాహానికి ప్రభుత్వం అందిస్తున్న పెట్టుబడి రాయితీ, పావలా వడ్డీ, విద్యుత్ సబ్సిడీ, పన్ను రాయితీలు తదితర పథకాల కింద జిల్లాలోని ఉత్పాదక మరియు సేవారంగాలకు చెందిన 21 యూనిట్లకు రూ.5.88 కోట్లకు పైగా విలువైన రాయితీ ప్రయోజనాల మంజూరుకు కమిటీ ఆమోదం తెలిపింది. జిల్లాలో మరిన్ని పరిశ్రమలు స్థాపించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పారిశ్రామికవేత్తలకు అవసరమైన సహకారం అందించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ ఎస్. మహబూబ్ బాషా, నాబార్డు డీడీఎం కార్తికేయ, ఎల్డీఎం అయ్యప్పరెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ కిశోర్ రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, ఎస్సీ, ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో మౌలిక వసతుల

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

**నాణ్యత ప్రమాణాలతో పనులు పూర్తి చేసి విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలి**

**జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి**



**నంద్యాల బ్యూరో, జూన్ 23( రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలోని మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో చేపడుతున్న మౌలిక వసతుల అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత శాఖల ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో “మన బడి - మన భవిష్యత్తు“ ఫేజ్-2 కింద చేపట్టిన పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక వసతులతో తీర్చిదిద్దడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన అభ్యాస వాతావరణాన్ని అందించడమే కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలోని పాఠశాలల్లో మేజర్, మైనర్ మరమ్మతులు, వరండాలను తరగతి గదులుగా మార్పు, విద్యుదీకరణ పనులు, తాగునీటి సౌకర్యంతో కూడిన మరుగుదొడ్ల నిర్మాణం తదితర నాలుగు ప్రధాన అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే మరో పది రకాల మౌలిక వసతుల అభివృద్ధి పనులకు సంబంధించి అంచనాలను సిద్ధం చేసి అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. ‘మన బడి - మన భవిష్యత్తు’ కార్యక్రమం అమలులో సమగ్ర శిక్షతో పాటు ఏపీడబ్ల్యూఐడీసీ, పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమ, మున్సిపల్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని 29 మండలాల్లో కొనసాగుతున్న పెండింగ్ పనులను శాఖల వారీగా బాధ్యతలు కేటాయించి పూర్తి చేయాలని ఆదేశించారు. ఫేజ్-2 పరిధిలో ఉన్న పాఠశాలల్లో కొనసాగుతున్న నిర్మాణ పనులను వేగవంతం చేయడంతో పాటు అవసరమైన అదనపు తరగతి గదులు, ఇతర మౌలిక వసతుల కోసం అంచనాలు సిద్ధం చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో అందుబాటులో ఉన్న నిధులను సద్వినియోగం చేసుకొని పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండరాదని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి జనార్ధన్ రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ నాగరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ శ్రీనివాసులు, వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## గురురాజా ఇంటర్నేషనల్ పాఠశాలలో

# ఘనంగా ఒలంపిక్ డే వేడుకలు

**వేడుకలను ప్రారంభించిన పాఠశాల అధినేత పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి**



**నంద్యాల జూన్ 23( రిపబ్లిక్ న్యూస్) :** నంద్యాల జిల్లా బాబా నగర్ సమీపంలోని గురురాజా ఇంటర్నేషనల్ పాఠశాలలో ఘనంగా ఒలంపిక్ దినోత్సవం వేడుకలను నిర్వహించారు. ఇంటర్నేషనల్ పాఠశాల డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పాఠశాల అధినేత డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి పాల్గొని ప్రారంభించారు. ముందుగా రాష్ట్ర జాతీయ స్థాయిలో పీట పథకాలు సాధించిన క్రీడాకారులతో ఒలంపిక్ టార్చ్ ను ప్రదర్శించారు. పాఠశాలలు నిర్వహించిన ఒలంపిక్ టార్చ్ ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒలంపిక్ క్రీడా దినోత్సవం వేడుకలు పాఠశాలలు నిర్వహించడం ఆనందంగా ఉందని తెలిపారు. విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి ఉత్సాహాన్ని నింపేందుకు వేడుకలు ఎంతో దోహదపడ్డాయని గుర్తు చేశారు. ప్రతి విద్యార్థి క్రీడా పోటీల్లో పాల్గొనేలా శిక్షణ ఇస్తూ అందుకు అవసరమైన ప్రోత్సాహాన్ని కల్పిస్తున్నామని గుర్తు చేశారు. ఒలంపిక్ క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఉషా కళ్యాణ్ పాల్గొన్నారు.




printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com